News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in :
www.cknewstv.in

# CK NEWS
చంద్ర కాంత్
తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 05 | సంచిక :178 | ఖమ్మం | మంగళవారం, ఆగస్టు 4, 2026 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad



## బీజేపీ కంచుకోటలో పీకే జెండా

- బంకీపూర్ ఉపఎన్నికలో సంచలన విజయం
- 30 ఏళ్ల కమలం కోట బద్దలు.. బిహార్ రాజకీయాల్లో కొత్త సమీకరణాలు
- బిహార్, మధ్యప్రదేశ్‌లో బీజేపీకి ఎదురుదెబ్బ.. గుజరాత్‌లో పరువు నిలుపుకున్న కమలం

4



## విద్యార్థుల బకాయిలు చెల్లించకుంటే ఉద్యమం

- పెండింగ్ నిధులను విడుదల చేయాలి
- సమస్య పరిష్కారం వరకు పోరాటం కొనసాగిస్తాం: ఆర్. కృష్ణయ్య

3

## నిరుద్యోగులను నట్టేట ముంచిన రేవంత్

- యువత జీవితాలతో ఆటలు
- యూత్ డిక్లరేషన్‌లోని 24 హామీల్లో ఒక్కటీ అమలు కాలేదు
- జాబ్ క్యాలెండర్‌కే విలువ లేకుండా చేశారు: కేటీఆర్

3





## సాగునీటి ప్రాజెక్టుల అనుమతులపై స్పెషల్ ఫోకస్

- ఆరు నెలల్లో పర్యావరణ అనుమతులే లక్ష్యం
- పాలమూరు-రంగారెడ్డి, సీతారామ, డిండి, గౌరవెల్లికి అత్యధిక ప్రాధాన్యం
- సుప్రీంకోర్టు తీర్పుతో కొత్త అవకాశాలు..
- అధికారులకు మంత్రి ఉత్తమ్ దిశానిర్దేశం

తెలంగాణ ప్రయోజనాల పరిరక్షణకు అంతర్రాష్ట్ర విభాగాన్ని బలోపేతం చేయాలి

రాష్ట్రంలోని 4 ప్రధాన సాగునీటి ప్రాజెక్టులైన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, సీతారామ సాగర్, డిండి, గౌరవెల్లి ప్రాజెక్టులకు రాబోయే ఆరు నెలల్లో పర్యావరణ అనుమతులు సాధించడమే లక్ష్యంగా ప్రణాళికబద్ధంగా వ్యవహరించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పర్యావరణ అనుమతుల అంశంపై సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన చారిత్రాత్మక తీర్పు తెలంగాణ ప్రాజెక్టులకు న్యాయపరమైన స్పష్టతనిచ్చిందని తెలిపారు. సోమవారం నాడు హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ బలరాం నాయక్ మరియు ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.

## నిమ్స్‌లో రొబోటిక్ సర్జరీల కొత్త చరిత్ర

- రెండున్నరేళ్లలోనే 1,000 శస్త్రచికిత్సలు పూర్తి
- వైద్య బృందాన్ని అభినందించిన సీఎం రేవంత్, మంత్రి దామోదర రాజనర్సింహ
- 90 శాతానికి పైగా ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్ ద్వారా ఉచిత చికిత్సలు

2



## పోలీస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియపై అసంతృప్తి

- ఇందిరాపార్క్ వద్ద నిరుద్యోగుల మెరుపు ధర్నా
- 19వేల ఖాళీ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్

2



## సింగరేణికి కొత్త ఊపిరి

ప్రజా ప్రభుత్వంలో సింగరేణికి కొత్త ఊపిరి లభించిందని ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో మణుగూరు పీకేఓసీ-2 డిప్‌సైడ్ బొగ్గు బ్లాక్‌ను సింగరేణి దక్కించుకోవడం చారిత్రక విజయమని అభివర్ణించారు. సింగరేణి పరిరక్షణ, విస్తరణతో పాటు తెలంగాణ ఇంధన భద్రతను సుస్థిరం చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం గత 30 నెలలుగా చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయని అమెరికా పర్యటనలో ఉన్న భట్టి విక్రమార్క ఒక ప్రకటనలో తెలిపారు.

3



- వేలంలో మణుగూరు పీకేఓసీ-2 డిప్‌సైడ్ బ్లాక్ కైవసం
- ఏటా 60 లక్షల టన్నుల చొప్పున 20 ఏళ్ల పాటు బొగ్గు వెలికితీత
- రెండు వేల మందికి ఉపాధి భద్రత.. మణుగూరు ప్రాంతానికి మరో 20 ఏళ్ల భరోసా
- ప్రజా ప్రభుత్వ కృషితోనే చారిత్రక విజయం: భట్టి విక్రమార్క

## సుప్రీంకోర్టులో మరో నాలుగు జడ్జిలకు గ్రీన్‌సిగ్నల్

- న్యాయమూర్తుల సంఖ్య 34 నుంచి 38కు పెంపు
- విపక్షాల ఆందోళనల మధ్య చర్చ లేకుండానే లోక్‌సభ ఆమోదం
- పెండింగ్ కేసుల వేగవంతమైన పరిష్కారమే లక్ష్యమన్న కేంద్రం

2





## ఈయేడు కుంభవృష్టి వర్షాలు తప్పవు

- వర్షాలతో ప్రాణనష్టం కూడా ఎక్కువే
- రంగం భవిష్యవాణిలో మాతంగి వెల్లడి

2

## సహజీవనం కూడా చట్టబద్ధమే!

- భాగస్వామిని వేధింపులకు గురి చేస్తే చట్టప్రకారం శిక్ష
- సుప్రీం ధర్మాసనం సంచలన తీర్పు

సహజీవనం అంశంపై సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. సహజీవనంలో భాగస్వామిని వేధింపులకు గురి చేస్తే భారతీయ శిక్షాస్మృతి లోని సెక్షన్ 498-ఏ ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయవచ్చని స్పష్టం చేసింది.





# ఈయేడు కుంభవృష్టి వర్షాలు తప్పవు

**వర్షాలతో ప్రాణనష్టం కూడా ఎక్కువే**

**రంగం భవిష్యవాణిలో మాతంగి వెల్లడి**

**హైదరాబాద్, ఆగస్ట్ 3:** సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయంలో మాతంగి స్వర్ణలత భవిష్యవాణి(రంగం) వినిపించారు. మీరెవరూ నేను చెప్పింది ఏదీ ఆచరించడం లేదంటూ మాతంగి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడకు నేను సంతోషంగా రాలేదు.. క్రోధంతో వచ్చానని అన్నారు. మీ ప్రశ్నలకు ఎందుకు సమాధానం చెప్పాలని నిలదీశారు. నా విగ్రహం ప్రతిష్ఠ చేస్తానని మాట ఇచ్చి జరిపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ఆపద వచ్చినా.. ప్రమాదం వచ్చినా కాపాడుతున్నానని మాతంగి స్వర్ణలత తెలిపారు. కానీ మీరు చేసే చర్యలే నాకు ఆగ్రహం తెప్పిస్తుందని అన్నారు. వావివరసలు లేకుండా ఘోరాలు జరుగుతున్నాయని.. అలాంటి వారిని వదిలిపెట్టనని అన్నారు. వారిని పాదాల కింద నలిపేస్తానని అన్నారు. ఈ ఏడాది ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాతంగి భవిష్యవాణిలో చెప్పారు. ఈ ఏడాది కుంభవర్షాలు ఉన్నాయని తెలిపారు. అగ్నిప్రమాదాలు కూడా పొంచి ఉన్నాయని చెప్పారు. ఈ ఏడాది ప్రాణనష్టం భారీగా జరుగుతుందని అన్నారు. కాబట్టి జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కొంతమంది కళ్లు నెత్తికెక్కి ప్రవర్తిస్తున్నారని మాతంగి స్వర్ణలత ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి ప్రవర్తన తనకు సంతోషం కలిగించడం లేదని తెలిపారు. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర చివరి ఘట్టానికి చేరుకుంది. ఈ ఉత్సవాల్లో భాగంగా రంగం భవిష్యవాణిని మాతంగి స్వర్ణలత వినిపించారు. తాను సంతోషంగా లేనని.. క్రోధంతో వచ్చానని భవిష్యవాణిలో చెప్పారు. ఈ ఏడాది కుంభవృష్టి ఉంది. వర్షాల్లో ప్రజలు కొట్టుకుపోయే పరిస్థితి ఉంది. రంగం భవిష్యవాణితో ఈ బోనాల జాతర ముగియనుంది. ఈ నేపథ్యంలో భక్తులు భారీ సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. రంగం అనంతరం అమ్మవారిని అంబారీపై ఊరేగించనున్నారు.

# జోగినిలకు గుర్తింపు కార్డులు

**లాల్‌దర్వాజ బోనాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి**

**జోగినిల సంక్షేమానికి ప్రభుత్వం అండ: మంత్రి పొన్నం**

**మహంకాళి ఆలయం వద్ద జోగినిల ఆందోళన..**

**హైదరాబాద్, ఆగస్టు 3:** లాల్‌దర్వాజ సింహవాహిని మహంకాళి బోనాల సందర్భంగా జోగినిలకు ప్రత్యేక గుర్తింపు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. వారికి ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. లాల్‌దర్వాజ బోనాల ఏర్పాట్లపై మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ ఉత్సవాల కోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందన్నారు. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చినప్పటికీ దర్శనాలు సజావుగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేశారని తెలిపారు. అమ్మవారి ఆశీర్వాదంతో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. జోగినిలు ప్రత్యేక గుర్తింపు కల్పించాలని కోరిన విషయాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని మంత్రి వెల్లడించారు. వారికి అధికారిక గుర్తింపు కార్డులు జారీ చేయడంతో పాటు, మున్సిపల్ ఎన్నికల్లో కో-ఆప్షన్ సభ్యులుగా అవకాశం కల్పించే అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు చెప్పారు. అమ్మవారికి సేవలందించే జోగినిల సంక్షేమానికి మూడు శాఖల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, ఉజ్జయిని మహంకాళి ఆలయం వద్ద జోగినిలు సోమవారం ఆందోళనకు దిగారు. బోనాల సందర్భంగా తమను ఆలయ సిబ్బంది, పోలీసులు అవమానించారని ఆరోపిస్తూ నిరసన వ్యక్తం చేశారు. జోగిని శ్యామల మాట్లాడుతూ, అవసరం వచ్చినప్పుడే ప్రభుత్వం జోగినిలను గుర్తు చేసుకుంటోందని విమర్శించారు. బోనాల సందర్భంగా కనీస ఏర్పాట్లు కూడా చేయకపోవడం బాధాకరమన్నారు. ఉదయం నుంచే ఆలయ గేట్ల వద్ద పోలీసులు జోగినిలను అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. బ్యారికేడ్లు తొలగించుకుని జోగినిలు ఆలయంలోకి ప్రవేశించగా, ఆలయం ముందు కొంతసేపు గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ కారణంగా రంగం కార్యక్రమం కూడా ఆలస్యంగా ప్రారంభమైంది. పరిస్థితిని చక్కదిద్దేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు జోగినిలతో సమావేశమై వారి సమస్యలను విన్నారు. ప్రభుత్వం వారి డిమాండ్లను పరిశీలిస్తుందని హామీ ఇవ్వడంతో జోగినిలు ఆందోళన విరమించారు.

# ఎన్‌కౌంటర్‌లో కరుడుగట్టిన గ్యాంగ్‌స్టర్ హతం

**తుపాకీ లాక్కుని పారిపోతుండగా కాల్పులు**

**రాంచీ, ఆగస్ట్ 3:** ఝార్ఖండ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఓ కరుడుగట్టిన గ్యాంగ్‌స్టర్ హతమయ్యాడు. పోలీసుల తుపాకీ లాక్కుని పారిపోతుండగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో గ్యాంగ్‌స్టర్ సుజీత్ సిన్హా మరణించాడని పోలీసులు తెలిపారు. సాహిబ్‌గంజ్ డివిజనల్ జైలుకు అతడిని తరలిస్తుండగా శనివారం రాత్రి ఈ ఘటన జరిగిందని చెప్పారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం, ధన్‌బాద్ జైలు నుంచి సాహిబ్‌గంజ్ మండల్ జైలుకు తరలిస్తుండగా సాహిబ్‌గంజ్ హైవేపై ఈ ఘటన జరిగింది. నాలుగు పోలీసు వాహనాల ఎస్కార్ట్‌తో అతడిని పోలీసులు తరలించారు. అయితే, జమ్‌తారా పోలీస్ స్టేషన్ పరిధిలోకి కాన్వాయ్ వచ్చేసరికి తాను మరుగుదొడ్డికి వెళ్లాలని అతడు కోరాడు. వాహనాలు ఆపిన సమయంలో అతడు తుపాకీ లాక్కుని చీకట్లోకి పారిపోయేందుకు ప్రయత్నించాడని పోలీసులు తెలిపారు. తమపై కాల్పులు కూడా జరిపాడని అన్నారు. స్వీయరక్షణ కోసం తామూ కాల్పులు జరపాల్సి వచ్చిందని చెప్పారు. అతడు ఘటనా స్థలంలోనే మరణించినట్టు అక్కడికి వచ్చిన మెడికల్ టీమ్ ప్రకటించింది. జమ్‌తారా ఎస్పీ శంభు కుమార్ సింగ్ ఆధ్వర్యంలో ఈ ఉదంతంపై దర్యాప్తు కొనసాగుతోంది. ఝార్ఖండ్‌లో సిన్హాపై అనేక కేసులు ఉన్నాయి. బలవంతపు వసూళ్లు, హత్య, హత్యాయత్నం తదితర కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. రాష్ట్రంలో తన ఇన్‌ఫ్లుయెన్స్‌ను కొనసాగించేందుకు పలు గ్యాంగులతో జట్లు కట్టి నెట్‌వర్క్‌ను నిర్మించుకున్నాడని పోలీసులు తెలిపారు.

# సాగునీటి ప్రాజెక్టుల అనుమతులపై స్పెషల్ ఫోకస్

- ఆరు నెలల్లో పర్యావరణ అనుమతులే లక్ష్యం
- పాలమూరు-రంగారెడ్డి, సీతారామ, డిండి, గౌరవెల్లికి అత్యధిక ప్రాధాన్యం
- సుప్రీంకోర్టు తీర్పుతో కొత్త అవకాశాలు..
- అధికారులకు మంత్రి ఉత్తమ్ దిశానిర్దేశం



**హైదరాబాద్, ఆగస్టు 3:** రాష్ట్రంలోని కీలక సాగునీటి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు సాధించే ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, సీతారామ సాగర్, డిండి, గౌరవెల్లి ప్రాజెక్టులను అత్యున్నత ప్రాధాన్య జాబితాలో ఉంచి, సాధ్యమైనంత వరకు ఆరు నెలల్లో పర్యావరణ అనుమతులు సాధించేలా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని సూచించారు. సచివాలయంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, పర్యావరణ అనుమతుల అంశంపై సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు రాష్ట్రానికి న్యాయపరమైన స్పష్టతను కల్పించిందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖతో పాటు సంబంధిత సంస్థల వద్ద పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలను వేగంగా ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. గతంలో చట్టబద్ధంగా అనుమతులు పొందిన ప్రాజెక్టులకు రక్షణ కొనసాగుతుందని, తిరస్కరణకు గురైన ప్రతిపాదనలను సాంకేతిక లోపాలు సరిచేసి అవసరమైతే తిరిగి సమర్పించాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల కోసం సాగించిన న్యాయపోరాటం వల్లే ఈ అనుకూల పరిస్థితి ఏర్పడిందని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ ప్రయోజనాల పరిరక్షణలో అంతర్రాష్ట్ర విభాగం కీలక పాత్ర పోషిస్తుందని, దానిని సాంకేతిక, పర్యావరణ, న్యాయ నిపుణులతో మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. ప్రతి ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి చరిత్ర, అనుమతులు, రీడిజైన్‌లు, న్యాయపరమైన అంశాలు, పెండింగ్ కేసులు, సాంకేతిక వివరాలన్నింటినీ ఒకే సమగ్ర దస్త్రంలో సిద్ధంగా ఉంచాలని సూచించారు. ప్రతి ప్రాజెక్టుకు ప్రత్యేక నోడల్ అధికారిని నియమించి, ఏడు రోజుల్లో అన్ని రికార్డులు సేకరించాలని, 30 రోజుల్లో పర్యావరణ అధ్యయనాలు, భూ రికార్డులు, న్యాయపరమైన పత్రాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రధాన పరిపాలనా ప్రక్రియతో పాటు దరఖాస్తుల తయారీ, పరిశీలన, సమర్పణను 60 రోజుల్లో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. గౌరవెల్లి ప్రాజెక్టుపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించిన మంత్రి, పంప్‌హౌస్‌ను పూర్తిస్థాయిలో వినియోగానికి సిద్ధంగా ఉంచాలని ఇంజినీర్లను ఆదేశించారు. పంపుల తనిఖీలు, మరమ్మతులు, కాలువల పరిశీలన, నీటి ప్రవాహానికి అడ్డంకుల తొలగింపు వంటి పనులను అత్యవసరంగా పూర్తి చేయాలని సూచించారు. సీతారామ సాగర్ ప్రాజెక్టుకు అవసరమైన పర్యావరణ పత్రాలను నవీకరించి, అనుమతులు లభించిన వెంటనే పనులు పునఃప్రారంభించేలా టెండర్లు, ఇంజినీరింగ్ ప్రణాళికలు ముందుగానే సిద్ధం చేయాలని ఆదేశించారు. పాలమూరు-రంగారెడ్డి, డిండి ప్రాజెక్టుల విషయంలోనూ ఇదే స్థాయి అత్యవసరతతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఎన్‌జీటీ, సుప్రీంకోర్టు తదితర న్యాయస్థానాల్లో కొనసాగుతున్న కేసుల విషయంలో న్యాయ సలహాదారులు, శాఖాధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు. న్యాయస్థానాల్లో విచారణకు ముందే అన్ని సాంకేతిక నివేదికలు, కౌంటర్ అఫిడవిట్లు సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**పోలవరం బ్యాక్‌వాటర్‌పై ముందస్తు అప్రమత్తత**

పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ప్రభావంపై కూడా సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగింది. తెలంగాణలోని గ్రామాలు, భూములు, ప్రజా ఆస్తులపై పడే ప్రభావాన్ని శాస్త్రీయంగా అంచనా వేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. విశ్వసనీయ క్షేత్రస్థాయి సమాచారం, సాంకేతిక అధ్యయనాలు, ఆర్థిక అంచనాల ఆధారంగా తెలంగాణ వాదనను కేంద్రం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ ముందు బలంగా వినిపించాలని సూచించారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, పోలవరం పూర్తిస్థాయిలో వినియోగంలోకి వచ్చేలోపే ఉమ్మడి ఖమ్మం జిల్లాపై బ్యాక్‌వాటర్ ప్రభావాన్ని స్పష్టంగా అంచనా వేయాలని అన్నారు. ముంపు లేదా బ్యాక్‌వాటర్ ప్రభావంతో నష్టపోయే భూములు, మౌలిక వసతులు, ఇతర ఆస్తులకు పరిహారం చెల్లించే బాధ్యత సంబంధిత కేంద్ర సంస్థలదేనని స్పష్టం చేశారు. పరిహార దావాలకు అవసరమైన అంచనాలను త్వరగా పూర్తి చేసి, అధికారికంగా కేంద్ర సంస్థల ముందు ఉంచాలని మంత్రి ఉత్తమ్ అధికారులను ఆదేశించారు.

# పోలీస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియపై అసంతృప్తి

**ఇందిరాపార్క్ వద్ద నిరుద్యోగుల మెరుపు ధర్నా**



**హైదరాబాద్, ఆగస్ట్ 3:** తెలంగాణలో పోలీస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ నిరుద్యోగ యువత హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ చౌరస్తాలో సోమవారం మెరుపు ధర్నాకు దిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన 7,437 పోలీస్ పోస్టుల నోటిఫికేషన్ సరిపోదని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న సుమారు 19 వేల పోలీస్ పోస్టుల భర్తీకి మరో సమగ్ర నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నోటిఫికేషన్ విడుదలలో జరిగిన జాప్యం కారణంగా వేలాది మంది అభ్యర్థులు వయోపరిమితి దాటిపోయారని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఉద్యోగాలకు అర్హత కోల్పోయిన అభ్యర్థులకు న్యాయం చేయాలంటే వయోపరిమితిని పెంచాల్సిందేనని ప్రభుత్వాన్ని కోరారు. పోలీస్ నియామక నోటిఫికేషన్‌లో కానిస్టేబుల్ పోస్టులకు గరిష్ఠ వయోపరిమితిని 36 సంవత్సరాలకు, సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్‌ఐ) పోస్టులకు 38 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే దరఖాస్తు రుసుము కూడా నిరుద్యోగులపై అదనపు భారం అవుతోందని, దానిని వెంటనే తగ్గించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసిన నిరుద్యోగులు, తమ డిమాండ్లపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పోలీస్ ఉద్యోగాల భర్తీలో పారదర్శకతతో పాటు నిరుద్యోగులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ నేతలు మధుసూదన్ గౌడ్, శ్రీకాంత్, వీరేష్, కరుణాకర్, శ్రీకాంత్ రాథోడ్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టులో మరో నాలుగు జడ్జిలకు గ్రీన్‌సిగ్నల్

- న్యాయమూర్తుల సంఖ్య 34 నుంచి 38కు పెంపు
- విపక్షాల ఆందోళనల మధ్య చర్చ లేకుండానే లోక్‌సభ ఆమోదం
- పెండింగ్ కేసుల వేగవంతమైన పరిష్కారమే లక్ష్యమన్న కేంద్రం

**న్యూఢిల్లీ, ఆగస్టు 3:** సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను పెంచే కీలక బిల్లుకు లోక్‌సభ సోమవారం ఆమోదం తెలిపింది. ప్రధాన న్యాయమూర్తితో కలిపి సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను 34 నుంచి 38కు పెంచేందుకు జారీ చేసిన ఆర్డినెన్స్ స్థానంలో తీసుకొచ్చిన సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య (సవరణ) బిల్లు--2026ను సభ ఆమోదించింది. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ, రామమందిర విరాళాల వ్యవహారాలపై విపక్ష సభ్యులు నినాదాలతో నిరసన వ్యక్తం చేయడంతో సభలో గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో బిల్లుపై ఎలాంటి చర్చ జరగకుండానే స్పీకర్ ఓం బిర్లా దానిని ఓటింగ్‌కు పెట్టగా, సభ ఆమోదం తెలిపింది. ఆర్డినెన్స్‌ను వ్యతిరేకిస్తూ విపక్షాలు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని కూడా మూజువాణి ఓటుతో తిరస్కరించారు. సభలో బిల్లును ప్రవేశపెట్టిన కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, పెరుగుతున్న కేసుల భారం, న్యాయ విచారణ వేగవంతం చేయాల్సిన అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని న్యాయమూర్తుల సంఖ్య పెంపు నిర్ణయం తీసుకున్నామని వివరించారు. అనంతరం బిల్లుపై సభ్యులను మాట్లాడాలని స్పీకర్ కోరినా, విపక్షాల ఆందోళనలు కొనసాగడంతో చర్చ జరగలేదు.

**పెండింగ్ కేసుల పరిష్కారానికి దోహదం**

బిల్లు ఆమోదంపై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం సుప్రీంకోర్టులో దాదాపు లక్ష కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, ఏడాదికి సుమారు 65 వేల కేసులు పరిష్కారమవుతున్నప్పటికీ 75 వేల వరకు కొత్త కేసులు నమోదవుతున్నాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో న్యాయమూర్తుల సంఖ్య పెంపు ద్వారా కేసుల విచారణ వేగవంతమై ప్రజలకు త్వరితగతిన న్యాయం అందే అవకాశాలు మెరుగుపడతాయని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో 2019లో ఒకసారి, ఇప్పుడు మరోసారి సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య పెంచినట్లు రఘునందన్ రావు గుర్తు చేశారు. న్యాయవ్యవస్థ ఆధునికీకరణకు కేంద్రం ఇప్పటికే వేల కోట్ల రూపాయలు వెచ్చించిందని పేర్కొన్నారు. కొలీజియం వ్యవస్థలో మరింత పారదర్శకత అవసరమని, భవిష్యత్తులో జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు అంశాన్ని పరిశీలిస్తే మంచిదని అభిప్రాయపడ్డారు. జస్టిస్ ఉజ్జల్ భుయాన్ చేసిన తాజా వ్యాఖ్యలను కూడా స్వాగతిస్తూ, న్యాయవ్యవస్థలో సంస్కరణల దిశగా కేంద్రం చర్యలు తీసుకునే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# నిమ్స్‌లో రొబోటిక్ సర్జరీల కొత్త చరిత్ర

- రెండున్నరేళ్లలోనే 1,000 శస్త్రచికిత్సలు పూర్తి
- వైద్య బృందాన్ని అభినందించిన సీఎం రేవంత్, మంత్రి దామోదర రాజనర్సింహ
- 90 శాతానికి పైగా ఆరోగ్యశ్రీ, సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఉచిత చికిత్సలు



**హైదరాబాద్, ఆగస్టు 3:** ప్రభుత్వ వైద్య రంగంలో నిమ్స్ మరో అరుదైన మైలురాయిని అధిగమించింది. కేవలం రెండున్నర సంవత్సరాల వ్యవధిలోనే 1,000 రొబోటిక్ శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేసి రాష్ట్ర వైద్యరంగంలో కొత్త రికార్డు సృష్టించింది. ఈ ఘనత సాధించిన నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఆపరేషన్ థియేటర్ బృందాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అభినందించారు. సోమవారం సచివాలయంలో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్ కలిసి రొబోటిక్ సర్జరీల వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యాధునిక వైద్య సేవలను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో నిమ్స్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఇటీవలే 2,000 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను పూర్తి చేసిన నిమ్స్, ఇప్పుడు 1,000 రొబోటిక్ సర్జరీల మైలురాయిని చేరుకోవడం ప్రభుత్వ వైద్యరంగ సామర్థ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. దక్షిణ భారతదేశంలో ప్రభుత్వ రంగంలో తొలి రొబోటిక్ కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించిన నిమ్స్, దేశంలోని ప్రముఖ అవయవ మార్పిడి కేంద్రాల్లో ఒకటిగా నిలిచిందని మంత్రి గుర్తు చేశారు. ప్రస్తుతం నిమ్స్‌తో పాటు ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రిలో కూడా రొబోటిక్ శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నామని, నిర్మాణంలో ఉన్న కొత్త టిమ్స్ ఆసుపత్రులు, గాంధీ, కొత్త ఉస్మానియా ఆసుపత్రుల్లోనూ ప్రపంచస్థాయి రొబోటిక్ ఆపరేషన్ థియేటర్లను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్ మాట్లాడుతూ ఇప్పటివరకు నిర్వహించిన వెయ్యి రొబోటిక్ శస్త్రచికిత్సల్లో యూరాలజీ విభాగంలో 590, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగంలో 248, సర్జికల్ ఆంకాలజీ విభాగంలో 162 శస్త్రచికిత్సలు జరిగినట్లు తెలిపారు. వీటిలో 90 శాతానికి పైగా ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పూర్తిగా ఉచితంగా నిర్వహించడం విశేషమన్నారు. ఖరీదైన రొబోటిక్ శస్త్రచికిత్సలను కూడా సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురాగలిగామని చెప్పారు. ఈ విజయానికి యూరాలజీ, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, సర్జికల్ ఆంకాలజీ, అనస్థీషియా విభాగాలు, నర్సింగ్ సిబ్బంది, ఆపరేషన్ థియేటర్ బృందం, ఇతర సహాయక విభాగాల సమిష్టి కృషే కారణమని ఆయన తెలిపారు. రాష్ట్రంలో ఆధునిక వైద్య సేవల విస్తరణకు సహకరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక ప్రకటన విడుదల చేసి నిమ్స్ వైద్య బృందాన్ని అభినందించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యాధునిక వైద్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే ప్రజా ప్రభుత్వ సంకల్పం ఫలిస్తోందన్నారు. ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అత్యధిక రొబోటిక్ శస్త్రచికిత్సలను ఉచితంగా నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. వైద్యరంగంలో నిమ్స్ మరిన్ని మైలురాళ్లు అధిరోహించాలని ఆకాంక్షించారు.

# దళితులపై వివక్ష వీడాలి: డీహెచ్‌పీఎస్.

**సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరిక.**



సి కె న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి,ఆగస్టు 03,దళితుల అభివృద్ధి, సంక్షేమం విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న వివక్షపూరిత విధానాలను విరమించి, రాజ్యాంగం కల్పించిన హక్కులను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సలిగంటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. దళితుల సమస్యల పరిష్కారం కోసం డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నా అనంతరం జిల్లా అధికారులకు వినతిపత్రం సమర్పించారు.

పేరాల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో సలిగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులతో పాటు తరతరాలుగా నివసిస్తున్న దళితులకు కూడా సమాన హక్కులు, సంక్షేమ పథకాల ప్రయోజనాలు, అభివృద్ధి అవకాశాలు కల్పించాలని కోరారు. సాగు చేస్తున్న అసైన్డ్ భూములకు పట్టాలు మంజూరు చేసి భూ హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు.

ఎస్సీ సబ్‌ప్లాన్‌ను పునరుద్ధరించి నిధులను పూర్తిస్థాయిలో విడుదల చేయడంతో పాటు, దళిత యువ పారిశ్రామికవేత్తలకు మంజూరైన ఇండస్ట్రియల్ రుణాల సబ్సిడీని వెంటనే విడుదల చేయాలని కోరారు. అలాగే బెస్ట్ అవైలబుల్ స్కీమ్ నిధులను విడుదల చేసి, సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పథకంలో దళిత నిరుపేదలకు ప్రాధాన్యం కల్పించాలని, ప్రైవేటు రంగంలో ఎస్సీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని, గ్రామాల్లో బెల్ట్ షాపులను నిర్మూలించాలని ఆయన కోరారు.

దళితుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించకపోతే జిల్లా, రాష్ట్ర స్థాయిలో భారీ ధర్నాలు, రాస్తారోకోలు, కలెక్టరేట్ ముట్టడిలతో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ అంకితకు అందజేశారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముత్యాల విశ్వనాథం, జిల్లా కార్యవర్గ సభ్యులు గనిగళ్ల వీరాస్వామి, విశంశెట్టి పూర్ణచంద్రరావు, కంచర్ల జమలయ్య, డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు దొంతమాల చెన్నయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శి కే. రత్నకుమారి, పోలమూరు ధనలక్ష్మి, మద్దాల హరిత, జంగం మోహన్‌రావు, మామిడాల ధనలక్ష్మి, వరుసు రామకృష్ణ, పోలమూరి శ్రీనివాస్, మండల రాజు, రవికిషోర్, మేదిని లక్ష్మి, దారా లక్ష్మి, ఇమ్మానుయేల్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లు కాదు... మరణ మార్గాలుగా మారాయి!

**నారాయణఖేడ్ ఎమ్మెల్యే శ్రీ సంజీవరెడ్డి గారికి బీఎస్పీ హెచ్చరికతో కూడిన విజ్ఞప్తి**



ఆగస్టు (03) సి కె న్యూస్ అబ్దుల్లా ఉస్మాన్ నారాయణఖేడ్ జిల్లా సంగారెడ్డి.

నారాయణఖేడ్ నియోజకవర్గంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్పీ నారాయణఖేడ్ అధ్యక్షులు అనుముల తుకారం మాట్లాడుతూ, ఎంజీ వక్కరేని, నాగలిగిద్ద, ఇరాక్‌పల్లి, శాఖాపూర్, సిర్గాపూర్ మండలాలతో పాటు చుట్టుపక్కల గ్రామాల రహదారులు పూర్తిగా దెబ్బతిని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రతిరోజూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం దురదృష్టకరమన్నారు. నారాయణఖేడ్ పట్టణంలోని ప్రధాన రహదారులు కూడా గుంతలమయంగా మారి ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారాయని, అత్యవసర సమయంలో అంబులెన్స్‌లు సకాలంలో చేరలేని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు.

నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ సంజీవరెడ్డి గారు వెంటనే స్పందించి, దెబ్బతిన్న అన్ని రహదారులను అత్యవసర ప్రాతిపదికన మరమ్మతు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలను సమీకరించి బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

"ప్రజల ప్రాణాలు ముఖ్యమా?లేక ప్రభుత్వ నిర్లక్ష్యమా? ఇకనైనా మేల్కొని వెంటనే రోడ్ల మరమ్మతులు చేపట్టండి. ప్రజల సహనాన్ని పరీక్షించవద్దు. రోడ్లు అభివృద్ధికి ప్రతీకలు కావాలి, మరణ మార్గాలు కాదు." అని అనుముల తుకారం ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు మలికి దొడ్డి పండరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు

## తాళం వేసిన ఇల్లే టార్గెట్ పట్టపగలే చోరీ....

**వైద్యం కోసం వెళ్ళితే, ఇంటికి కన్నం వేసిన దొంగలు...**



సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల :జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల మండలం,తుర్కోంపల్లి గ్రామంలో పట్టపగలే తలారి నర్సింహులు ఇంట్లో చోరీ జరిగినట్లు ఇంటి యజమాని తెలిపారు. వైద్యం కోసం గద్వాల జిల్లా కేంద్రానికి వెళ్లి వచ్చి చూసే వరకు ఇల్లు గుల్ల చేసారు.ఇంట్లో ఉండే 30 వేల నగదు, 5 తొలల బంగారు, 10 తులాల వెండి పట్టీలు అపహారణ గురైనట్లు గుర్తించిన భాదితుడు రూరల్ పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న రూరల్ ఎస్సై శ్రీకాంత్... సార్

## భద్రాద్రిలో రాష్ట్రస్థాయి భజన పోటీలు.



- వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భజన బృందాలు..
- భక్తి పారవశ్యంలో మునిగిన భద్రాద్రి.
- "భజన కేవలం పాట కాదు.. ఆధ్యాత్మిక లోకంలోకి తీసుకెళ్లే సాధనం" : డా. కృష్ణచైతన్య స్వామి

సి కె న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి,ఆగస్టు 03,భద్రాచలంలోని శ్రీ కల్పవృక్ష నరసింహస్వామి వారి సన్నిధిలో డా. కృష్ణచైతన్య స్వామి ఆధ్వర్యంలో ధర్మ పరిరక్షణ, భారతీయ సనాతన సంప్రదాయాల పరిరక్షణ లక్ష్యంగా రాష్ట్రస్థాయి భజన పోటీలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తెలుగు రాష్ట్రాలతో పాటు పలు రాష్ట్రాల నుంచి వచ్చిన భజన బృందాలు తమ ఆధ్యాత్మిక గానాలతో భక్తులను ఆకట్టుకున్నాయి.

సాంప్రదాయ భజనలు, హరినామ సంకీర్తనలు, తప్పెట భజనలు, కీర్తనలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ప్రతి బృందం తమదైన శైలిలో శ్రీహరిని కీర్తిస్తూ భక్తి పారవశ్యాన్ని పంచింది.

మూడు రోజులపాటు నిర్వహించనున్న ఈ పోటీల తొలి రోజునే వేలాది మంది భక్తులు తరలివచ్చి కార్యక్రమాన్ని తిలకించారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.

ఈ సందర్భంగా డా. కృష్ణచైతన్య స్వామి మాట్లాడుతూ, "భజన అనేది కేవలం పాట కాదు.. మనసును పరమాత్మతో అనుసంధానించే ఆధ్యాత్మిక సాధనం. ధర్మం, సంస్కృతి, ఆధ్యాత్మిక విలువల పరిరక్షణలో భజనకు విశిష్ట స్థానం ఉంది. యువత భారతీయ సంస్కృతిని తెలుసుకొని భక్తి మార్గంలో నడవాలి. అంతరించిపోతున్న సాంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది" అని అన్నారు.

భద్రాద్రిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి భజన పోటీలు భక్తి, సంస్కృతి, ధర్మ పరిరక్షణకు ప్రతీకగా నిలిచాయని పాల్గొన్న భక్తులు పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అభిప్రాయపడ్డారు. పోటీల్లో పాల్గొన్న భజన బృందాల సభ్యులు తమకు ఆహ్వానం పలికి సత్కరించిన డా. కృష్ణచైతన్య స్వామికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## బాలల సభ నిర్వహించిన సర్పంచ్ మద్దెల వనజ స్వామి,





ఆగస్టు 03 సీ కే న్యూస్ చేగుంట :గౌడుగుపల్లి ప్రభుత్వ పాఠశాలలో బాలల సభ సర్పంచ్ మద్దెల వనజ స్వామి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది, ఈ సభ బాలల కోసం బాలలు నిర్వహించుకొనే సభ విద్యార్థులు పాఠశాల పరిసర ప్రాంతాలలో పరిశుభ్రంగా ఉంచాలని పాఠశాలలో ఏ సమస్య ఉన్న తమ దృష్టి కి తీసుకురావాలని వారు పేర్కొన్నారు, ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మద్దెల స్వామి, పంచాయతీ కార్యదర్శి మల్లేశం హెడ్మాస్టర్ బాల్ రెడ్డి వార్డు సభ్యులు దుర్గని నర్సింలు, పాఠశాల సిబ్బంది అంగన్వాడి టీచర్ రేఖ, నాగరాణి పిల్లలు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు,

# కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడమే లక్ష్యం -డిసిసి అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్ గారు

ఆదిలాబాద్ జిల్లా సి కె న్యూస్ ప్రతినిధి

సామాజిక న్యాయం, మహిళా ప్రాధాన్యతతో మండల కమిటీల ఏర్పాటు

పార్టీ కోసం శ్రమించే ప్రతి కార్యకర్తకూ తగిన గుర్తింపు

ఆగస్టు 15 లోగా కమిటీల ప్రక్రియ పూర్తి కావాలి

ఈ రోజు ఆదిలాబాద్ రూరల్ & మావాల మండలాల కాంగ్రెస్ పార్టీ సర్వ సభ్య సమావేశలాలో పాల్గొన్న డీసీసీ డా నరేష్ జాదవ్ గారు .

కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతంలో భాగంగా చేపట్టిన 'సంఘటన్ శ్రీజన్ అభియాన్ ' కార్యక్రమంలో భాగంగా ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్ గారు ఈ రోజు ఆదిలాబాద్ జిల్లా లో విస్తృత పర్యటన చేపట్టారు. మాజీ ఎంపీ సోయం బాపూరావు గారు మరియు ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ కంది శ్రీనివాస్ రెడ్డి గార్లతో కలిసి ఆయన ఆదిలాబాద్ రూరల్ & మావల మండల సర్వసభ్య సమావేశం ఆదిలాబాద్ పట్టణం లోని చిలుకూరి లక్ష్మీ గార్డెన్ లో నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల ముఖ్య సమావేశంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మండల కమిటీల ఏర్పాటు మరియు పార్టీ బలోపేతంపై స్థానిక నాయకులకు డాక్టర్ నరేష్ జాదవ్ గారు దిశా నిర్దేశం చేశారు.

సమావేశంలో డిసిసి అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్ గారు మాట్లాడుతూ నూతన మండల కమిటీల నియామకంలో ఎలాంటి వర్గ విభేదాలకు తావులేకుండా అందరినీ కలుపుకొనిపోవాలని, సామాజిక న్యాయం పాటిస్తూ పారదర్శకంగా కమిటీలను సిద్ధం చేయాలని సూచించారు.

ప్రతి మండల కమిటీలో మండల అధ్యక్షునితో కలిపి మొత్తం 21 మంది సభ్యులు ఉండాలి. ఇందులో ఇద్దరు ఉపాధ్యక్షులు, నలుగురు ప్రధాన కార్యదర్శులు (జనరల్ సెక్రటరీలు) మరియు ఎగ్జిక్యూటివ్ మెంబర్లు ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. పార్టీ కమిటీలలో మహిళా నాయకులకు, కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత కల్పించాలన్నారు.సీనియర్ నాయకులు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ల అనుభవాన్ని ఉపయోగించుకునేలా ప్రతి మండలంలో 'పొలిటికల్ అఫైర్స్ కమిటీ' (జుఖుష )ని ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు, జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కమిటీల ఏర్పాటు ప్రక్రియను ఆగస్టు 15 లోగా పూర్తి చేయాలని గడువు విధించారు.అలాగే గ్రామస్థాయి బూత్ స్థాయి కమిటీలను కూడా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.

పార్టీ అభివృద్ధికి, ప్రజల సమస్యలపై అంకితభావంతో పనిచేసే ప్రతి నాయకుడిని, కార్యకర్తను పార్టీ అధిష్టానం ఖచ్చితంగా గుర్తించి తగిన గౌరవం అందిస్తుందని హామీ ఇచ్చారు.

తదనంతరం ఆదిలాబాద్ మాజీ ఎంపీ సోయం బాపురావు గారు మాట్లాడుతూ

కాంగ్రెస్ పార్టీ గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయడం కోసం ఈ సమావేశం నిర్వహిస్తున్నామని అందరూ కలిసికట్టుగా బూత్,గ్రామ, మండల వర్గ విభేదాలు లేకుండా కలిసికట్టుగా పనిచేసేవారు కమిటీలో పేర్లను ఇవ్వాలని సూచించారు.

కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న సంక్షేమ పథకాలు ఇందిరమ్మ ఇండ్లు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో విమానాశ్రయ ఏర్పాటు కోసం అందిస్తున్న 2200 కోట్ల నిధులు, రేషన్ కార్డులు, ఉచిత సన్న బియ్యం, ఉచిత కరెంటు, మహిళలకు ఫ్రీ బస్సు, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని తెలిపారు ఇందిరమ్మ ఇల్లు తానే ఇస్తున్నట్టు స్థానిక ఎమ్మెల్యే గొప్ప లు చెప్పుకుంటున్నారని అలా చెప్పడం సిగ్గు చేటు అని ఇందిరమ్మ అంటేనే కాంగ్రెస్ అని కాంగ్రెస్ అంటేఇందిరమ్మ అని ప్రజలకు తెలుసని తెలిపారు .

తదనంతరం ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ కంది శ్రీనివాస్ రెడ్డి గారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం ప్రతి నాయకుడు కృషి చేయాలని మండల కమిటీలో పనిచేసే నాయకులకు స్థానం కల్పించాలని కాంగ్రెస్ నాయకులు ప్రజలలో ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని అలాగే తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను తాను చేస్తున్నట్టుగా స్థానిక ఎమ్మెల్యే చేస్తున్నట్టు కుట్రలను తిప్పి కొట్టాలని కాంగ్రెస్ కార్యకర్తలకు మార్గదర్శనం చేశారు.

ఈ కార్యక్రమంలో వారితోపాటు జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నరసయ్య గారు, ఆదిలాబాద్ మార్కెట్ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి గారు, మాజీ డిసిసి సాజిద్ ఖాన్ గారు, మాజీ మార్కెట్ చైర్మన్ అల్లూరి సంజీవ రెడ్డి గారు, మాజీ మార్కెట్ చైర్మన్ అల్లూరి సంజీవ రెడ్డి గారు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మాధవ్ పటేల్ గారు, గిమ్మ దీపక్ గారు, రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు సెద్మకి ఆనందరావు గారు, అదేవిధంగా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ శాంతన్ రావు గారుజిల్లా జనరల్ సెక్రటరీ లు గౌలి సంజీవ్ కుమార్ గారు,మల్యాల కరుణాకర్ గారు, అక్తర్ అలీ గారు, లక్ష్మ రెడ్డి గారు,మాజీ టీటీడీ బోర్డు మెంబర్ బెజ్జంకి అనిల్ గారు,కాంగ్రెస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రూరల్ మండల అధ్యక్షుడు వెంకట్ యాదవ్ గారు, జిల్లా జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సుధాకర్ గౌడ్ గారు, అదిలాబాదు రూరల్ మండల మాజీ వైస్ ఎంపీపీ ఎల్టీ భోజ రెడ్డి గారు, మా మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సంజయ్ దూబే గారు,మాజీ జడ్పీటీసీ కొండా గంగాధర్ గారు,పొచ్చేరా సర్పంచ్ గంగన్న, అంకోలి గ్రామ సర్పంచ్ మాడవి కిషన్ గారు, ఎస్ఎస్ఎల్ జిల్లా సెక్రెటరీ పుండ్ర నర్సింగ్ గారు, అదిలాబాద్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు బాలు గారు,మాజీ ఎంపీటీసీలు సింగిల్ విండో చైర్మన్, డైరెక్టర్లు పాల్గొన్నారు

అలాగే మావల మండల అధ్యక్షులు కుదురుపాక సురేష్ గారు, మావల గ్రామ సర్పంచ్ ధర్మపురి చంద్రశేఖర్ గారు, ఉప సర్పంచ్ అడేళ్లు గారు,మాజీ జెడ్పిటిసి అనిత గారు, మాజీ ఎంపీపీ అట్లూరి గోవర్ధన్ రెడ్డి గారు, గణపతి రెడ్డి గారు, బట్టి సావర్గాం సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి గారు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు భూపెల్లి శ్రీధర్ గారు, మావల మండల ఎస్సీ సెల్ చైర్మన్ అంబటి అక్షయ్ గారు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కోరటి ప్రభాకర్ గారు, ఎన్ఎస్యు ఐ మండల అధ్యక్షులు మరుస కోల గౌతమ్ గారు, జిల్లా కాంగ్రెస్ ఎస్టీ సెల్ వైస్ ప్రెసిడెంట్ అశోక్ గారు, మావల మండల ఓబీసీ వైస్ ప్రెసిడెంట్ రాజేంద్ర గారు, మండల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## మంద బొగుడ గ్రామ సమస్యలు తీర్చండి

**మాజీ ఎంపీ ని కలిసిన ఆదివాసులు**



బోత్ సి కె న్యూస్ బోథ్ మండలంలోని మందబోగుడా గ్రామపంచాయతీలో నెలకొన్న సమస్యలు తీర్చాలని, గ్రామపంచాయతీ భవనం, అంగన్వాడి భవనం, కమ్యూనిటీ హాల్, దండారి షెడ్డు నిర్మించాలని గ్రామ పెద్దలు మాజీ ఎంపీ, ఎమ్మెల్యే, రాజ్ గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపురావు ను మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలు విన్నవించారు

ప్రధాన సమస్యగా ఉన్న రోడ్డు సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు

గ్రామస్తులు తెలిపిన సమస్యలకు సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులకు ఫోన్ చేసి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, త్వరలోనే గ్రామాన్ని సందర్శించి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని సోయం బాపూరావు హామీ ఇచ్చారు

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, అందూర్ సర్పంచ్ పెందూర్ పృథ్వీరాజ్, నక్కలవాడా సర్పంచ్ అడప నవీన్ కుమార్, ఎస్టీ సెల్ బోథ్ మండల అధ్యక్షులు ఉమేష్ జాదవ్, చౌహన్ దేవిదాస్, లక్ష్మణ్, జలపతి, డిసిసిబి బ్యాంకు మాజీ చైర్మన్ అడ్డీ భోజా రెడ్డి,గ్రామ పెద్దలు పాల్గొన్నారు

## తాంసి మండల కాంగ్రెస్ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్



**తంసి సికె న్యూస్ .....**కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతంలో భాగంగా చేపట్టిన 'సంఘటన్ సృజన్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా నేడు తాంసి పట్టణ కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సర్వసభ్య సమావేశంలో మాజీ ఎంపీ సోయం బాపూరావు, డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్, మాజీ డీసీసీబీ చైర్మన్ అడ్డి బోజారెడ్డితో కలిసి బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మండల కమిటీల ఏర్పాటు, పార్టీ బలోపేతం, గ్రామ స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు పార్టీ నిర్మాణాన్ని మరింత పటిష్టం చేసే అంశాలపై నాయకులకు దిశానిర్దేశం చేశారు.

ఆడే గజేందర్ మాట్లాడుతూ, నూతన మండల కమిటీల నియామకంలో వర్గ విభేదాలకు తావులేకుండా అందరినీ కలుపుకొని, సామాజిక న్యాయం పాటిస్తూ పారదర్శకంగా కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి మండల కమిటీలో అధ్యక్షుడితో కలిపి మొత్తం 21 మంది సభ్యులు ఉండేలా, అందులో ఇద్దరు ఉపాధ్యక్షులు, నలుగురు ప్రధాన కార్యదర్శులు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఉండే విధంగా కమిటీలను రూపొందించాలని తెలిపారు. మహిళా నాయకులకు, కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత కల్పించాలని సూచించారు.

అలాగే సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధుల అనుభవాన్ని వినియోగించుకునేందుకు ప్రతి మండలంలో పొలిటికల్ అఫైర్స్ కమిటీ (ూూజ) ఏర్పాటు చేయాలని, జిల్లా వ్యాప్తంగా మండల కమిటీల ఏర్పాటును ఆగస్టు 15లోగా పూర్తి చేసి, గ్రామ మరియు బూత్ స్థాయి కమిటీలను కూడా వెంటనే ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే ప్రతి నాయకుడు, కార్యకర్తను పార్టీ అధిష్ఠానం తప్పకుండా గుర్తించి తగిన గౌరవం కల్పిస్తుందని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో సభ అధ్యక్షులు మండల కన్వీనర్ కౌడల సంతోష్, ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి సంజీవ్ రెడ్డి, తాంసి మాజీ ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, ఇచ్చోడ బ్లాక్ ఆత్మ చైర్మన్ కౌడల నారాయణ ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ధనుంజయ్ , అశోక్ ,జిల్లా ప్రధాన కార్యదర్శి మల్యాల కరుణాకర్, మాజీ టీటీడీ బోర్డు సభ్యుడు బెజ్జంకి అనిల్ ,మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు అరుణ్, ఉప సర్పంచ్ ల సంఘం అధ్యక్షుడు గంగారెడ్డి, బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ యువజన అధ్యక్షుడు బద్దం పోతరెడ్డి, వడ్డాది సర్పంచ్ గంగాధర్, గొట్టుకూరి సర్పంచ్, లింబుగూడ సర్పంచ్ సాంబు పొన్నారి , అంబుగాం ఉప సర్పంచ్లు రామ్ రెడ్డి, భారత్, నాయకులు గంగన్న, విలాస్, గజనందు, బాపురెడ్డి , వెంకన్న, నాందేవ్, నవీన్ , నితిన్, రఘు రెడ్డి, రవి, రజబ్ అల్లి,సద్దాం , మౌలానా తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరికలు,

**జిల్లా అధ్యక్షులు కండువా కప్పి ఆహ్వానించారు,**




**ఆగస్టు 03 సీ కే న్యూస్ చేగుంట,** మెదక్ మండల్ వెంకటాపూర్ గ్రామానికి, చెందిన బిఆర్ఎస్ పార్టీ తాజా మాజీ ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు ప్రభాకర్ వారితో పాటు మాజీ ఉప సర్పంచ్ లు మాజీ వార్డు లకు పార్టీలోకి కండువా కప్పు ఆహ్వానించారు, ఈ కార్యక్రమంలో మండల ఉప్ప సర్పంచుల ఫోరం అధ్యక్షులు లను మాజీ ఉప్ప సర్పంచులు వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు,

## తిమ్మాపూర్ ఎక్స్ రోడ్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం,

**బైక్‌పై వెళ్తున్న యువకుడు మృతి.. మరో వ్యక్తికి తీవ్ర గాయాలు,**



**షాద్ నగర్ నియోజకవర్గ సి కె న్యూస్ ప్రతినిధి,ఆగస్టు 03:** కొత్తూరు మండలం తిమ్మాపూర్ ఎక్స్ రోడ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటనపై కొత్తూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు

కొత్తూరు పోలీసుల వివరాల ప్రకారం హైదరాబాద్‌లోని సైదాబాద్ మాదన్నపేటకు చెందిన సల్లావుద్దీన్ (59) కుకింగ్ మాస్టర్‌గా పనిచేస్తూ కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు ఆయన కుమారుడు బనీస్ (29) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు ఆగస్టు 2న ఉదయం బనీస్ తన స్నేహితుడు అజ్జుతో కలిసి బజాజ్ ప్లాటినా ద్విచక్రవాహనంపై జేపీ దర్గాకు వెళ్లాడు

అదే రోజు రాత్రి సుమారు 8.45 గంటల సమయంలో బనీస్ ఫోన్ నుంచి కుటుంబ సభ్యులకు ఓ గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి తిమ్మాపూర్ ఎక్స్ రోడ్ వద్ద ప్రమాదం జరిగిందని బైక్‌పై ఉన్న వ్యక్తికి తలకు తీవ్ర గాయాలై మృతి చెందినట్లు వెనుక కూర్చున్న వ్యక్తికి కూడా తీవ్ర గాయాలైనట్లు సమాచారం అందించాడు దీంతో సల్లావుద్దీన్ వెంటనే హైదరాబాద్ నుంచి తిమ్మాపూర్ ఎక్స్ రోడ్‌కు చేరుకుని పరిశీలించగా అక్కడ ప్రమాదం జరిగిన ఆనవాళ్లు రక్తపు మరకలు కనిపించాయని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు

బనీస్ బైక్‌పై హైదరాబాద్ వైపు వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడం వల్లగానీ మరేదైనా కారణంతోగానీ ప్రమాదం జరిగి ఉండవచ్చని ఫిర్యాదుదారు అనుమానం వ్యక్తం చేశారు ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన బనీస్ మృతి చెందినట్లు తెలిపారు

ఫిర్యాదు మేరకు కొత్తూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు

## కొత్తూర్ మున్సిపాలిటీలో 53 ఐమాక్స్ లైట్లు ప్రారంభించిన ఎమ్మెల్యే

**రూ 50 లక్షలతో ఐమాక్స్ లైట్లును ఖరీదు చేసిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**షాద్నగర్ నియోజకవర్గం సీకే న్యూస్ ప్రతినిధి ఆగస్టు 3 :** రంగారెడ్డి జిల్లా షాద్నగర్ నియోజకవర్గం కొత్తూరు మున్సిపాలిటీకి కొత్త కళ వచ్చిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం కొత్తూర్ మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగంగా ఆయా వార్డుల పరిధిలోని తిమ్మాపూర్,స్టేషన్ తిమ్మాపూర్ అక్కివేనిగూడ, కుమ్మరిగూడ,కొత్తూరు, కొత్తూరు తండాలలో కొత్తగా ఏర్పాటు చేసిన ఐమాక్స్ లైట్లు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ప్రధాన చౌరస్తాలు,రద్దీ ప్రాంతాలలో హైమాస్ట్ లైట్లు అందుబాటులోకి రావడంతో కాలనీలలో చీకటి సమస్యలు తొలిగిపోతాయని,రాత్రి వేళల్లో రాకపోకలు సాగించే ప్రజలకు మరియు వాహనదారులకు ఎంతో లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే తెలిపారు.కొత్తూర్ మున్సిపాలిటీలో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని,ప్రజల అవసరాలకు అనుగుణంగా అన్ని వార్డుల్లోనూ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సాహితి రెడ్డి,సీఐ నాగార్జున రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జాండగూడెం సుదర్శన్ గౌడ్, మాజీ కౌన్సిలర్ కోస్గి శ్రీనివాస్, సర్పంచ్ కొమ్ము కృష్ణ,మాజీ ఎంపిటిసి రాజేందర్ గౌడ్,మాజీ సర్పంచులు ఏనుగు జనార్దన్ రెడ్డి,జగన్, నందిగామ మండల అధ్యక్షుడు కుమారస్వామి గౌడ్,మాజీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కర్రోళ్ల సురేందర్, సీనియర్ నాయకులు కమ్మరి జనార్దన్ చారి,ఇందూరి శ్రీనివాస్,పీర్ల గూడెం మహేష్ గౌడ్,గోవిందు నాయక్,భరత్ గౌడ్, తుప్పర రమేష్,చింత సాయి తేజేశ్వర్,కోస్గి మహేష్,కోస్గి కుమార్,కూన శివ కుమార్ గౌడ్,కోస్గి బాలు,కోస్గి దశరథ్,చిలకమర్రి నరసింహ,పాశం కృష్ణ,వెంకటయ్య,జితేందర్ రెడ్డి,శివ, కొండ రెడ్డి సుమన్,తదితరులు పాల్గొన్నారు.



## న్యాయవాది మల్లయ్య దారుణ హత్యను తీవ్రంగా ఖండిస్తున్నాం.

**నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలి --ూూఖ రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకట్ రెడ్డి.**



**సి కే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు ఆగస్టు 3.**కొల్లాపూర్ కోర్టు పరిధిలోని పెంట్లవెల్లిలో న్యాయవాది మల్లయ్యను అత్యంత దారుణంగా హత్య చేయడం సభ్య సమాజాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ూూఖ) యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది.

ఈ సందర్భంగా ూూఖ రాష్ట్ర ఉపాధ్యక్షులు అడ్వకేట్ మామిడి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు న్యాయం అందించేందుకు కృషి చేస్తున్న న్యాయవాదిపై ఇంతటి క్రూరమైన దాడి జరగడం అత్యంత అమానుషమని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవాదుల భద్రత ప్రశ్నార్థకంగా మారిందని, రాష్ట్ర ప్రభుత్వం ఈ ఘటనను అత్యంత ప్రాధాన్యంతో తీసుకుని ప్రత్యేక దర్యాప్తు చేపట్టి నిందితులను వెంటనే అరెస్ట్ చేసి చట్టప్రకారం అత్యంత కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదుల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలని, అడ్వకేట్స్ ప్రొటెక్షన్ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మృతుడు మల్లయ్య కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు తగిన ఆర్థిక సహాయం, కుటుంబ సభ్యుడికి ఉపాధి కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో ూూఖ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు బోల్లెపల్లి కుమార్, ఉపాధ్యక్షులు తడక మోహన్, జగతయ్య, ఎం.డి. నేహాల్, సూదగాని శ్రీహరి, సిసా శ్రీనివాస్, చింతల రాజశేఖర్ రెడ్డి, బొడ్డు కిషన్, జిట్టా భాస్కర్ రెడ్డి, పిడుగు ఐలయ్య మల్లేష్ హైమద్ తదితరులు పాల్గొని మల్లయ్య హత్యను తీవ్రంగా ఖండిస్తూ నిందితులపై వేగవంతమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## తొలి దశ ఉద్యమకారునికి నివాళులర్పించిన ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్

**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు ఆగస్టు 3.** ఉద్యమకారుల ఫోరం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు గంధ మల్ల బాలయ్య గుండెపోటుతో సోమవార తెల్లవారుజామున మరణించగా ఆయనకి ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉద్యమకారుల ఫోరం నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన స్వగ్రామంలో జరిగిన అంతిమయాత్రలో పాల్గొని ఆయన పార్థివ దేహం పై పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం డాక్టర్ చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన మాట ప్రకారం మేనిఫెస్టోలో పొందుపరచిన హామీలను వెంటనే అమలు చేసి ఉద్యమకారులను ఆదుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షుడు శీలం స్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజన్న, మొగుళ్ళ



శ్రీనివాస్, పలుసం రమేష్,ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు మారగోని శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తిని సహదేవ్ గౌడ్, సాయిని యాదగిరి బొడిగెసుదర్శన్, ఐటిపాముల పుష్పమ్మ, మల్లం వెంకటేశం, ఎక్కలదేవి శ్రీనివాస్ ,కదిరేని స్వామి, కన్నె కంటి శ్రీనివాస చారి, కొత్త రామ చందర్ ,దండ మల్లికార్జున్ ,కొండూరు సత్తయ్య, పల్లెర్ల రామచంద్రం, దండ మల్లికార్జున్,ఎదురుగట్ల యాదగిరి, సందయ్య, లక్ష్మయ్య, ఎడవల్లి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## తల్లి--బిడ్డల క్షేమమే ఐసీడీఎస్ లక్ష్యం.







ఐసిడిఎస్ సిడిపిఓ కమల ప్రియ.

**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**తల్లి, బిడ్డల ఆరోగ్య పరిరక్షణే ఐసీడీఎస్ ప్రధాన లక్ష్యమని చింతకాని సీడీపీఓ చావా కమల ప్రియ అన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తప్పనిసరిగా పట్టించాలని, తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారమని పేర్కొన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా చింతకాని మండలంలోని నేరేడ--1 అంగన్వాడీ కేంద్రంలో సెక్టార్ సూపర్వైజర్ సంధ్యారాణి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తల్లిపాలు తాగిన పిల్లల్లో రోగనిరోధక శక్తి అధికంగా ఉండటంతో పాటు శారీరక, మానసిక వికాసం మెరుగ్గా ఉంటుందని తెలిపారు. గర్భిణీలు గర్భం దాల్చినప్పటి నుంచే పోషకాహారం తీసుకోవాలని సూచించారు. పోషకాహార లోపం వల్ల రక్తహీనతతో పాటు ప్రసవ సమయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుందని వివరించారు.స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తల్లిపాల ప్రాముఖ్యతపై ర్యాలీలు, గృహ సందర్శనలు, సమావేశాల ద్వారా తల్లులు, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ ఎస్.కె. సోయర్ గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందించే వ్యాధి నిరోధక టీకాల ప్రాముఖ్యతను వివరించారు.కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ముత్తయ్య, ఏఎన్ఎం లక్ష్మి, గ్రామ సెక్రటరీ అర్జున్, జీపీఓ వెంకట్, అంగన్వాడీ టీచర్ వెంకమ్మ, ఆశ కార్యకర్తలు, ఆయాలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## గుడ్ న్యూస్ స్కూల్‌లో విద్యార్థి నాయకుల ఎన్నిక

**ఎస్‌పీఎల్‌గా మనోజ్, ఏఎస్‌పీఎల్‌గా శాంతి శ్రీ ఎంపిక**



**సీకే న్యూస్ ఖమ్మం ప్రతినిధి ఇస్లావత్ నరసింహ ఆగస్టు 04 2026:** ఏన్కూరు మండల పరిధి టీఎల్‌పేట గ్రామపంచాయతీలోని గుడ్ న్యూస్ స్కూల్‌లో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు విద్యార్థి నాయకుల ఎన్నిక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్యూపిల్ లీడర్ (ఎస్‌పీఎల్) గా మనోజ్, అసిస్టెంట్ స్కూల్ ప్యూపిల్ లీడర్ (ఏఎస్‌పీఎల్) గా శాంతి శ్రీలను ఎంపిక చేసి బాధ్యతలు అప్పగించారు. అనంతరం ఎన్నికైన విద్యార్థి నాయకులను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి అభినందించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లింగన్నపేట సర్పంచ్ ప్రవీణ్ను కూడా పాఠశాల యాజమాన్యం శాలువాతో ఘనంగా సన్మానించింది.

ఈ సందర్భంగా సర్పంచ్ ప్రవీణ్ మాట్లాడుతూ, "విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవడం ఎంతో అవసరం. నాయకత్వం అంటే కేవలం హోదా కాదు, బాధ్యతతో కూడిన సేవాభావం. ఎస్‌పీఎల్, ఏఎస్‌పీఎల్‌గా ఎన్నికైన విద్యార్థులు తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తూ క్రమశిక్షణ, నిజాయితీ, సేవా భావంతో ముందుకు సాగాలి. విద్యతో పాటు మంచి విలువలను అలవర్చుకుని భవిష్యత్తులో సమాజానికి ఆదర్శ పౌరులుగా ఎదగాలని" ఆకాంక్షించారు.

పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ, విద్యార్థుల్లో నాయకత్వం, బాధ్యతాయుతమైన వైఖరి, సేవా దృక్పథాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. నూతనంగా ఎన్నికైన విద్యార్థి నాయకులు పాఠశాల అభివృద్ధికి తోడ్పడుతూ ఉపాధ్యాయులకు సహకరించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొని నూతన విద్యార్థి నాయకులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## అగ్నిప్రమాదం మూడు లక్షల నగదు బూడిద...



**గద్వాల నియోజకవర్గం ఆగస్టు 3:**గద్వాల్ పట్టణం పిల్లిగుండ్ల కాలనీలో నివాసముంటున్న బుడగ జంగాల గోపాల్ గుడిసెలో ఎవరూ లేని సమయంలో అగ్నిప్రమాదం . ఇంటి అవసరాల కోసం తెచ్చిన రూ.3 లక్షల నగదు, బంగారు, వెండి, ఇంటి ప్లాట్ పత్రాలు, కుమారుడి చదువు సర్టిఫికెట్లు ఇంటిలోని సామాగ్రి పూర్తిగా దగ్ధశీ. ప్రభుత్వం, దాతలు తన కుటుంబాన్ని ఆదుకోవాలని బాధితుడు గోపాల్ వేడుకుంటున్నారు.

# తల్లి--బిడ్డల క్షేమమే ఐసీడీఎస్ లక్ష్యం.

- ఐసిడిఎస్ సిడిపిఓ కమల ప్రియ.







**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** తల్లి, బిడ్డల ఆరోగ్య పరిరక్షణే ఐసీడీఎస్ ప్రధాన లక్ష్యమని చింతకాని సీడీపీఓ చావా కమల ప్రియ అన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తప్పనిసరిగా పట్టించాలని, తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారమని పేర్కొన్నారు.

ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా చింతకాని మండలంలోని నేరేడ--1 అంగన్వాడీ కేంద్రంలో సెక్టార్ సూపర్వైజర్ సంధ్యారాణి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తల్లిపాలు తాగిన పిల్లల్లో రోగనిరోధక శక్తి అధికంగా ఉండటంతో పాటు శారీరక, మానసిక వికాసం మెరుగ్గా ఉంటుందని తెలిపారు. గర్భిణీలు గర్భం దాల్చినప్పటి నుంచే పోషకాహారం తీసుకోవాలని సూచించారు. పోషకాహార లోపం వల్ల రక్తహీనతతో పాటు ప్రసవ సమయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుందని వివరించారు.స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తల్లిపాల ప్రాముఖ్యతపై ర్యాలీలు, గృహ సందర్శనలు, సమావేశాల ద్వారా తల్లులు, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ ఎస్.కె. సోయర్ గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందించే వ్యాధి నిరోధక టీకాల ప్రాముఖ్యతను వివరించారు.కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ముత్తయ్య, ఏఎన్ఎం లక్ష్మి, గ్రామ సెక్రటరీ అర్జున్, జీపీఓ వెంకట్, అంగన్వాడీ టీచర్ వెంకమ్మ, ఆశ కార్యకర్తలు, ఆయాలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# ఆడపిల్లల ఆరోగ్య క్షేమమే మా లక్ష్యం...



**సి కే న్యూస్ మల్దకల్ ఆగస్టు 03:** హెచ్ పి వి టీకాను వేసుకుందాం – క్యాన్సర్ ను దూరం చేద్దాం

వై.శైలజ శ్రీనివాస్ రెడ్డి

గ్రామ సర్పంచ్ బిజ్వారం

జోగులాంబ గద్వాల జిల్లా, మల్దకల్ మండలం బిజ్వారం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు జి. మహేష్ అధ్యక్షతన ఈ సమావేశానికి గ్రామ సర్పంచ్ వై శైలజ శ్రీనివాస్ రెడ్డి,హెల్త్ డిపార్ట్మెంట్ సిబ్బంది హాజరై విద్యార్థులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్,ఎంఎల్ హెచ్ పి మాట్లాడుతూ....14, 15 సంవత్సరాల వయసు నిండిన బాలికలికలు ప్రతి ఒక్కరు హెచ్ పి వి వ్యాక్సిన్ తప్పకుండగా వినియోగించుకోవాలని అన్నారు.ఈ యొక్క హెచ్ పి వి వ్యాక్సిన్ క్యాన్సర్ రోగానికి ఉపయోగపడుతుందని అన్నారు. గర్భాశయ ముఖద్వారం ద్వారా ఏర్పడే క్యాన్సర్ బారిన పడకుండగా జాగ్రత్తగా చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని అందుకు ఈ యొక్క టీకా వాడుకోవాలని అవసరం ఎంతైనా ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక హెల్త్ సిబ్బంది, ఆశ వర్కర్లు,విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

# విబి-జి రామ్‌జి ఉద్యోగులకు చిన్నారెడ్డి అండ



**సి.కె. న్యూస్ ప్రతినిధి -- వనపర్తి జిల్లా** వనపర్తి జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన విక్షత్ భారత్--రోజ్‌గార్ మరియు ఆజీవికా మిషన్ (గ్రామీణ్) గ్యారంటీ (ఎదీ-+ =ూవీ+) ఉద్యోగులు తమ పెండింగ్ వేతనాల తక్షణ విడుదల, క్యాడర్ స్ట్రెంత్ ఖరారు, పదోన్నతులు, బదిలీలు, కెరీర్ అడ్వాన్స్‌మెంట్ పాలసీ అమలు తదితర డిమాండ్లపై తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి గారిని కలిసి వినతిపత్రం అందజేశారు.

వినతిపత్రంపై స్పందించిన డాక్టర్ చిన్నారెడ్డి రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ దివ్య గారితో, సీఎంఓ కార్యాలయానికి చెందిన శ్రీధర్ గారితో ఫోన్‌లో మాట్లాడి ఉద్యోగుల సమస్యలను వివరించారు. పెండింగ్ వేతనాల విడుదల, క్యాడర్ స్ట్రెంత్ ఖరారు, పదోన్నతులు, బదిలీలు, కెరీర్ అడ్వాన్స్‌మెంట్ పాలసీ వంటి డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని అధికారులు తెలిపినట్లు ఆయన వెల్లడించారు.

ఒక్క పే స్కేల్ అమలు అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, ఫైల్ త్వరితగతిన ఆమోదం పొందేలా కృషి చేస్తానని చిన్నారెడ్డి హామీ ఇచ్చారు. రూరల్ డెవలప్‌మెంట్‌లో ఐకేపీ, ఎదీ-+ =ూవీ+ ఉద్యోగులు సమానంగా సేవలందిస్తున్నారని, అందరికీ న్యాయం జరిగేలా తన పూర్తి మద్దతు ఉంటుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా జేఏసీ కన్వీనర్ బాలయ్య, కో-కన్వీనర్ కోళ్ల సత్తన్న, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, ఉద్యోగులు భాస్కర్, రామస్వామి, ముఖీద్‌తో పాటు అన్ని మండలాలకు చెందిన ాూాలు, జుజలు, ూాలు, దీఖీలు, జూలు పాల్గొన్నారు.

# సీఎస్కే వెంచర్ యజమాని బీరప్ప స్వామి దేవాలయం కూల్చివేత దారుణం

- షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ ఆగ్రహం
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోకపోతే ప్రజా ఆందోళన తప్పదని హెచ్చరిక
- వందల ఏళ్ల చరిత్ర ఉన్న బీరప్ప దేవాలయం కూల్చివేతపై ఆవేదన
- దేవాలయ పిల్లర్లు, స్టీల్ తొలగించడం భక్తుల మనోభావాలకు దెబ్బ
- సీఎస్కే విల్లాస్ వెంచర్‌లో భూములపై అక్రమాల ఆరోపణలు
- భూమి అమ్మకపోయినా రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందని ప్రశ్న
- లేఅవుట్లకు అనుమతుల ముందు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలి
- ధనవంతుల మాటలు విని ప్రజలకు అన్యాయం చేయొద్దని అధికారులకు సూచన
- దేవాలయాలపై దాడులు సహించబోమన్న మాజీ ఎమ్మెల్యే
- ప్రజల్లో నమ్మకం కలిగేలా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్




**షాద్నగర్ నియోజకవర్గం సి.కే న్యూస్ ప్రతినిధి ఆగస్టు 3**

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని సీఎస్కే విల్లాస్ వెంచర్‌లో బీరప్ప స్వామి దేవాలయం నిర్మాణాలను కూల్చివేయడం పట్ల షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నేత వై. అంజయ్య యాదవ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం ఆయన సంఘటన స్థలాన్ని సందర్శించి కూల్చివేసిన దేవాలయ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు ఆయన వెంట పాల్గొన్నారు.

దేవాలయం కూల్చివేత జరిగిన ప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడిన అంజయ్య యాదవ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారం చేయడం తప్పు కాదని, కానీ ప్రజలను, రైతులను భయభ్రాంతులకు గురిచేసి మోసపూరితంగా భూములను స్వాధీనం చేసుకుని లేఅవుట్లు వేయడం దారుణమని అన్నారు. ఫరూక్‌నగర్ ప్రాంతంలో వందల ఏళ్ల చరిత్ర కలిగిన బీరప్ప గడ్డ, కురుమ కులస్థుల ఇష్టదైవమైన బీరప్ప స్వామి దేవాలయాన్ని కూల్చివేయడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. పట్టపగలు దేవాలయాలను కూల్చివేసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకునే పరిస్థితి లేదని హెచ్చరించారు. తమ తాతలు, తండ్రుల కాలంలో నిర్మించిన దేవాలయాన్ని నేడు కూల్చివేయడం అత్యంత దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. దేవాలయానికి సంబంధించిన పిల్లర్లు, స్టీల్ సామగ్రిని కూడా దౌర్జన్యంగా తొలగించడం భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసే చర్య అని అన్నారు.

**వెంచర్ భూములపైనా అక్రమాల ఆరోపణలు**

సీఎస్కే విల్లాస్ వెంచర్‌లో పలువురు రైతుల భూములను కూడా అక్రమంగా స్వాధీనం చేసుకున్నట్లు తన దృష్టికి వస్తోందని అంజయ్య యాదవ్ ఆరోపించారు. పక్కనే ఉన్న రైతు తన భూమిని అమ్మకపోయినా, రిజిస్ట్రేషన్ చేయించకపోయినా ఆ భూమిని కూడా లేఅవుట్ చేసినట్టు ఉందని, ఇలాంటి అక్రమాలు ఎన్ని జరిగాయో అధికారులు విచారణ చేసి బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

**అధికారుల నిర్లక్ష్యమే కారణం**

వెంచర్లకు లేఅవుట్ అనుమతులు మంజూరు చేసే ముందు అధికారులు క్షేత్రస్థాయిలో ఎందుకు పరిశీలించడం లేదని ప్రశ్నించారు. వాస్తవ పరిస్థితులను పరిశీలించకుండా ధనవంతులు చెప్పిన మాటలు నమ్మి ప్రజలకు అన్యాయం చేయడం సరికాదన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయని విమర్శించారు.

**పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలి**

బీరప్ప దేవాలయం కూల్చివేత ఘటనపై పోలీసులు వెంటనే కేసు నమోదు చేయడమే కాకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్య డిమాండ్ చేశారు. ఈ ఘటనపై చర్యలు తీసుకోకపోతే ప్రజల్లో అసహనం, ఆగ్రహం పెరిగి ఆందోళనలు చెలరేగే అవకాశం ఉందని హెచ్చరించారు. అలాంటి పరిస్థితులు తలెత్తక ముందే ప్రభుత్వం, పోలీసులు స్పందించాలని కోరారు.

దేవాలయాలపై దాడులు జరిగితే ప్రజలు ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నించిన ఆయన, భక్తుల విశ్వాసాలను దెబ్బతీసే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమన్నారు. పోలీసులు వెంటనే స్పందించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, మున్సిపాలిటీ అధికారులు కూడా సంఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని డిమాండ్ చేశారు.

**న్యాయపోరాటంతో పాటు ప్రజా ఉద్యమం కూడా**

మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ, ఈ వ్యవహారంలో న్యాయపరంగా పోరాటం చేయడంతో పాటు అవసరమైతే ప్రజా ఉద్యమాన్ని కూడా చేపడతామని స్పష్టం చేశారు. కొంతమంది రెండు ఎకరాల భూమి కొనుగోలు చేసి అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలో లేఅవుట్లు వేస్తున్నారని, ఇలాంటి అక్రమ పద్ధతుల్లో కొందరు సిద్ధహస్తులుగా మారారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను శిక్షించాలని డిమాండ్ చేశారు. చివరగా, దేవాలయాలపైనే ఇలాంటి దాడులు జరిగితే ప్రజలు తీవ్ర ఆవేదనకు గురవుతారని, పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకుంటేనే ప్రజల్లో నమ్మకం ఏర్పడుతుందని అన్నారు. లేదంటే సమాజంలో ఘర్షణలకు దారితీసే పరిస్థితులు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరిస్తూ, ప్రభుత్వం, పోలీసులు, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ కోరారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అందే బాబాయ్య, కౌన్సిలర్లు పిల్లి శారద శేఖర్, జయలక్ష్మి కిషోర్ ఎస్పీ శివ, మండల అధ్యక్షులు లక్ష్మణ్ నాయక్, మాజీ పీఎసీఎస్ చైర్మన్ విఠల్, మాజీ కౌన్సిలర్ జూపల్లి శంకర్, చిన్న యాదగిరి, నాయకులు నక్కల వెంకటేష్ గౌడ్, రవి యాదవ్, నందిగామ శ్రీనివాస్, బిక్షపతి, చెర్క శివ, పాండు, సాయి తదితరులు, కుర్వ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లకు ఎదురుచూపులు




- మొదటి విడతే పూర్తి కాక.. రెండో విడతపై నీలినీడలు
- ఇందిరమ్మ ఇళ్ల ఎంపికపై పెరుగుతున్న సందిగ్ధత
- ఏన్కూరు మండలంలో లబ్ధిదారుల్లో పెరుగుతున్న ఎదురుచూపులు

**సీకే న్యూస్ ఖమ్మం ప్రతినిధి ఇస్లావత్ నరసింహ ఆగస్టు 04 2026:** పేదలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ఏన్కూరు మండలంలో మాత్రం ఆశించిన వేగంతో ముందుకు సాగడం లేదు. ముఖ్యంగా ఐటీడీఏ పరిధిలో మంజూరైన ఇళ్లకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఇప్పటికీ పూర్తికాకపోవడంతో అర్హులైన నిరుపేద కుటుంబాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. మొదటి విడతలో కూడా వివిధ కారణాల వల్ల అర్హులైన కొంతమందికి ఇళ్లు మంజూరు కాలేదని, రెండో విడత ఎంపిక ప్రక్రియ మాత్రం ఇప్పటివరకు ప్రారంభం కాకపోవడంతో వేలాది మంది పేదల్లో నిరాశ నెలకొంది.

మొదటి విడతలో లబ్ధిదారులుగా ఎంపికవుతామని ఆశించిన పలువురికి సాంకేతిక, పరిపాలనా, అర్హతల పరిశీలన వంటి కారణాలతో ఇళ్లు మంజూరు కాలేదని స్థానికులు చెబుతున్నారు. వారికి మరో అవకాశం లభిస్తుందనే ఆశతో ఎదురుచూస్తున్న సమయంలో రెండో విడత ప్రక్రియ కూడా ప్రారంభం కాకపోవడంతో వారి ఆశలు మరింత దూరమవుతున్నాయి.

ఇళ్ల కోసం నెలల తరబడి ఎదురుచూస్తున్న నిరుపేద కుటుంబాలు గ్రామపంచాయతీలు, మండల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా స్పష్టమైన సమాచారం అందడం లేదని వాపోతున్నారు. తుది లబ్ధిదారుల జాబితా ఎప్పుడు విడుదల చేస్తారో, ఎంపిక ప్రక్రియ ఎప్పుడు పూర్తవుతుందో తెలియక అయోమయంలో ఉన్నామని చెబుతున్నారు.

ఈ జాప్యానికి రాజకీయ కారణాలే ఉన్నాయనే అభిప్రాయాన్ని కొందరు స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కాంగ్రెస్ నాయకుల మధ్య ఉన్న అంతర్గత విభేదాల ప్రభావం లబ్ధిదారుల ఎంపికపై పడిందని ఆరోపిస్తున్నారు. అయితే ఈ ఆరోపణలపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ గానీ, సంబంధిత అధికారుల నుంచి స్పందన గానీ వెలువడలేదు.

ఏన్కూరు మండల పరిధిలోని 25 గ్రామపంచాయతీల్లో గుడిసెల్లో, అద్దె ఇళ్లలో, శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసిస్తున్న నిజమైన నిరుపేద కుటుంబాలను గుర్తించి వారికి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. రాజకీయాలు, సిఫార్సులు, ఒత్తిళ్లకు తావులేకుండా అర్హతనే ఏకైక ప్రమాణంగా తీసుకుని లబ్ధిదారులను ఎంపిక చేస్తే ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరుగుతుందని అభిప్రాయపడుతున్నారు.

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఈ పథకం అసలైన లక్ష్యం పేదలకు సొంతింటి కలను నెరవేర్చడమేనని, అందుకు అనుగుణంగా మొదటి విడతలో మిగిలిపోయిన అర్హుల సమస్యలను పరిష్కరించి, రెండో విడత ఎంపిక ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని మండల ప్రజలు కోరుతున్నారు. అలాగే ఎంపిక ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించి, గ్రామస్థాయిలో అభ్యంతరాలు స్వీకరించిన అనంతరం తుది జాబితాను ప్రకటించాలని సూచిస్తున్నారు. జాప్యానికి గల కారణాలను అధికారులు బహిర్గతం చేసి, అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి త్వరితగతిన ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## పిచ్చి మొక్కల తొలగించిన సర్పంచ్ కొండి రాజ్య లక్ష్మి స్వామి,



**ఆగస్టు 03 (సీ కే న్యూస్) చేగుంట :** పొలంపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ కొండి రాజ్యలక్ష్మి స్వామి ఆధ్వర్యంలో గ్రామంలోని డ్రైనేజీల వద్ద ఉన్న పిచ్చి మొక్కలను గ్రామ సిబ్బందితో కలిసి తొలగించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలం కారణంగా మన ఇంటి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా చేసుకునే బాధ్యత ప్రతి ఒక్క కుటుంబం పై ఉంటుంది, గ్రామ ప్రజలం అందరం వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్త వహిస్తూ, మన ఇంట్లో ఉన్న ప్లాస్టిక్ వస్తువులను, మట్టి కుండలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ ఉండాలని , తడి పొడి చెత్తను వేరు చేసి గ్రామపంచాయతీ ట్రాక్టర్ పై వేస్తూ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలి, గ్రామ పెద్దల సాయ సహకారాలతో గ్రామాన్ని అభి వృద్ధి చేసుకునే బాధ్యత మన అందరిపైన ఉంటుంది, అందుకు ప్రజలందరూ సహకరించాలని వారు కోరారు,

# తిరుమలపురం గ్రామసభలో అభివృద్ధి, ప్రజారోగ్యంపై కీలక నిర్ణయాలు.

**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** చింతకాని మండల పరిధిలోని తిరుమలపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రామసభలో గ్రామాభివృద్ధి, ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు.

గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు అధ్యక్షతన జరిగిన ఈ గ్రామసభలో గ్రామ కార్యదర్శి కొండపల్లి ఉమారాణి, ఉపసర్పంచ్ గోగుల నాగమణి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

గ్రామంలో ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీటి సరఫరా, పనిచేయని వీధి దీపాల మరమ్మతులు, డ్రైనేజీ కాలువల శుభ్రత, దోమల నివారణకు ప్రత్యేక స్ప్రే, డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి గ్రామ ప్రజలకు ఆరోగ్య పరీక్షలు, వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

అలాగే ప్రతి ఇంటి వద్ద మొక్కలు నాటి వాటి సంరక్షణకు గ్రామస్థులు బాధ్యత వహించాలని, పరిశుభ్రమైన గ్రామ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, పారిశుద్ధ్య నిర్వహణ, మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజా సమస్యల సత్వర పరిష్కారంపై గ్రామసభలో చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ చాపలమడుగు వీరబాబు మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని, గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. గ్రామ కార్యదర్శి కొండపల్లి ఉమారాణి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం గ్రామాభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేస్తామని తెలిపారు.



ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గోగుల నాగమణి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల సభ్యులు, యువకులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతులకు విద్యుత్ అంతరాయం లేకుండా పూర్తిస్థాయిలో అధికారులు పనిచేయాలి ...



విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే .

సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల

ఈరోజు గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు జిల్లా విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం ను ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి నిర్వహించారు.

సబ్ స్టేషన్లను వినియోగించుకొని విద్యుత్ అంతరాయం లేకుండా రైతులకు నాణ్యమైన విద్యుత్ ని అందించాలని సూచించారు..

ఎమ్మెల్యే మాట్లాడుతూ ....

ప్రస్తుతం వర్షాకాలం కావడంతో రైతులకు పొలాలకు విద్యుత్ ఎంతో ఉపయోగకరమైనది. గద్వాల నియోజకవర్గంలో రైతులకు విద్యుత్ అంతరాయం లేకుండా నిర్నీత కాల వ్యవదిలో రైతులకు సకాలంలో విద్యుత్ అందిస్తూ సబ్ స్టేషన్ దగ్గర ఇలాంటి సమస్యను ఓవర్ ం లో వోల్టేజ్ వంటి సమస్యలను లేకుండా రైతులకు పంటలు పండించుకోవడానికి నాణ్యమైన విద్యుత్ అందించాలని కోరారు.

సంబంధిత విద్యుత్ సబ్ స్టేషన్ దగ్గర లైన్మెన్లు గ్రామాలలో రైతులకు, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

సబ్ స్టేషన్ వద్ద 33/11 ఎఐ ట్రాన్స్ఫారమర్ల తో విద్యుత్ సరఫరా చేయాలి అదేవిధంగా కొన్ని గ్రామాలలో ఉన్న విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి. వీధి దీపాలు స్తంభాలను ఏర్పాటు చేయాలి వైర్లు కిందకు రాకుండా గ్రామాలలో వెంటనే సపోర్ట్ వైర్లను స్తంభాలలను ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బంది కలగకుండా వాటిని ఏర్పాటు చేయాలని సూచించారు.

భవిష్యత్తులో విద్యుత్ సమస్య అంటూ ఏ రైతుకు కూడా నిరాశ పడకుండా రైతులకు నాణ్యతమైన విద్యుత్తు ని అందించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యుత్ శాఖ అధికారి(రాజు అబ్దుల్ కరీం విద్యుత్ శాఖ ఇ. జు రవి ప్రసాద్ అన్ని మండల విద్యుత్ శాఖ ఇా. జు లు, ఇా. ఇ లు అధికారులు, నాయకులు నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తిరుమలాపురంలో ఘనంగా ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు.





సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి. చింతకాని మండల పరిధిలో తిరుమలాపురం గ్రామ అంగన్వాడి కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యత, శిశు ఆరోగ్య పరిరక్షణ, తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు, వైద్యులు డాక్టర్ సుప్రియ, గ్రామ కార్యదర్శి కొండపల్లి ఉమారాణి, ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వాతి, ఉపాధ్యాయుడు ప్రీతమ్, ఏఎన్ఎం రాజ్యం, ఉప సర్పంచ్ గోగుల నాగమణి, మొదటి వార్డు సభ్యురాలు బండి అరుణ, అంగన్వాడి టీచర్ నాగ సీతారత్నం పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, పుట్టిన శిశువుకు తల్లి పాలు అత్యుత్తమ ఆహారమని, మొదటి ఆరు నెలల పాటు తల్లి పాలు మాత్రమే అందించాలని సూచించారు. తల్లిపాల వల్ల శిశువుకు రోగనిరోధక శక్తి పెరిగి ఆరోగ్యవంతమైన ఎదుగుదల సాధ్యమవుతుందని తెలిపారు. గ్రామంలోని ప్రతి తల్లి తల్లిపాల ప్రాముఖ్యతను గుర్తించి పిల్లలకు తప్పనిసరిగా తల్లిపాలు అందించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో అంగన్వాడి సిబ్బంది, గర్భిణులు, బాలింతలు, గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# పాలకుర్తి రైతులకు శుభవార్త



కోడకండ్ల, తొర్రూరు మార్కెట్ల అభివృద్ధికి రూ.3.35 కోట్లు

పాలకుర్తి, సి కే న్యూస్ : పాలకుర్తి నియోజకవర్గంలోని కోడకండ్ల, తొర్రూరు వ్యవసాయ మార్కెట్ల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.3.35 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి చేసిన కృషి ఫలితంగానే ఈ నిధులు మంజూరయ్యాయని అధికారులు తెలిపారు. మంజూరైన నిధుల్లో కోడకండ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీకి రూ.2.43 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో మార్కెట్ యార్డులో భారీ కవర్డ్ షెడ్, టాయిలెట్ బ్లాక్, ఆర్.ఓ. ప్లాంట్‌తో కూడిన గది నిర్మాణంతో పాటు దేవరుప్పుల సబ్ మార్కెట్ యార్డులో నాబార్డ్ గోదాం చుట్టూ పాక్షిక ప్రహరీ గోడ నిర్మించనున్నారు. తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి రూ.92 లక్షలు మంజూరు చేయగా, ప్రధాన ద్వారం నుంచి గోదాం వరకు సీసీ రహదారి నిర్మాణం చేపట్టనున్నారు. దీంతో రైతులు వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించడంలో సౌలభ్యం పెరగనుంది. మార్కెట్ యార్డుల్లో ఆధునిక వసతులు కల్పించేందుకు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రులు, ఉన్నతాధికారులను పలుమార్లు కలిసి నిధుల మంజూరుకు కృషి చేసినట్లు పేర్కొన్నారు. నిధుల మంజూరుపై కోడకండ్ల, తొర్రూరు మార్కెట్ కమిటీల చైర్మన్లు, పాలకవర్గ సభ్యులు, రైతులు, హమాలీలు, వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు. రైతు సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి, ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# కార్మికుల హక్కుల కోసం పోరాడేది ఏఐటీయూసీ

జిల్లా ఏఐటీయూసీ మహాసభలను జయప్రదం చేయండి
సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల




సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి. చింతకాని : కార్మికుల హక్కుల కోసం పోరాడేది ఏఐటీయూసీ మాత్రమేనని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం చింతకాని మండల కేంద్రంలోని గంగవరపు విజయ్ కుమార్ భవన్లో నక్కన బోయిన కృష్ణ అధ్యక్షతన జరిగిన ఏఐటీయూసీ చింతకాని మండల 5వ మహాసభలో జమ్ముల మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్రమోడీ సర్కార్ నాలుగు లేబర్ కోడ్స్ తెచ్చి కార్మికుల హక్కులు కాలరాస్తుందన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలతో నడుస్తున్న ప్రభుత్వాలను ప్రశ్నించడానికి కార్మికులు ఏకమవ్వాలన్నారు. ఈ నెల 23, 24 వతేదీలలో సత్తుపల్లిలో జరిగే జిల్లా ఏఐటీయూసీ మహాసభలను జయప్రదం చేయాలన్నారు. సత్తుపల్లి లాంటి కేంద్రంలో ఏఐటీయూసీ మహాసభలు జరగుతున్నాయని, ఈ మహాసభలకు చింతకాని మండల వ్యాప్తంగా కార్మికులు హాజరై మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు మాట్లాడుతూ లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా పోరాడాల్సిందేనన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ లవల్ల కార్మిక వర్గం ఎనిమిది గంటల పని, కనీస వేతనాలు, సంఘ హక్కులు కోల్పోతున్నారన్నారు. శతాబ్ద కాలంగా కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక సంక్షేమ హక్కుల చట్టాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. సత్తుపల్లిలో జరిగే జిల్లా మహాసభలలో చింతకాని మండలంలోని అన్ని కార్మిక వర్గాల నుంచి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఏఐటీయూసీ చింతకాని మండల కన్వీనర్ గా బండి పుల్లారావు, కోకన్వీనర్ గా గోగుల వెంకట్రావు తో పాటు మరో 5గురు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రావి శివరామకృష్ణ సిపిఐ చింతకాని మండల కార్యదర్శి దూసరి గోపాల్ రావు ఏఐవైఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి బోళ్ళ భాను వర్కింగ్ ప్రెసిడెంట్ గోగుల వెంకన్న, నారపోగు సంపత్ కనకపుడి శంకర్ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

# జలబాయి తాండ రోడ్డుపై వరి నాట్లు ప్రజల వినూత్న నిరసన.

హామీలు నెరవేర్చని నేతలకు జలబాయి వాసుల హెచ్చరిక

సి కె న్యూస్ రిపోర్టర్ కొల్చారం, ఆగస్టు 3: మెదక్ జిల్లా కొల్చారం మండలం వరిగుంతం గ్రామపంచాయతీ పరిధిలోని జలబాయి తాండకు వెళ్లే రహదారి దయనీయ స్థితికి చేరడంతో తాండ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో రోడ్డు నిర్మిస్తామని హామీలు ఇచ్చిన రాజకీయ నాయకులు ఇప్పటివరకు మాట నిలబెట్టుకోలేదని మండిపడ్డారు.

రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో ప్రజలు వినూత్నంగా రోడ్డుపై వరి నాట్లు వేసి నిరసన చేపట్టారు. గ్రామపంచాయతీ ఎన్నికల సమయంలో మాత్రమే తమ సమస్యలు గుర్తుకు వస్తాయని, ఇప్పుడు రోడ్డు వేయాలని అడిగితే ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

మరోసారి ఓట్లు అడగడానికి వచ్చే నాయకులకు తగిన బుద్ధి చెబుతామని తాండ వాసులు హెచ్చరించారు. రోడ్డు నిర్మాణానికి అడ్డంకి ఏమిటో అధికారులు, ప్రజాప్రతినిధులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జలబాయి గిరిజన తండాకు వెళ్లే దారి

వెంటనే శాశ్వత రహదారి నిర్మాణం చేపట్టి ప్రజల ఇబ్బందులను తొలగించాలని జిల్లా ఉన్నతాధికారులను తాండ వాసులుకోరారు. ప్రస్తుతం వర్షాకాలంలో రాకపోకలు తీవ్రంగా ఇబ్బందికరంగా మారాయని వారు తెలిపారు.

దారి లేని తండా..

జలబాయి గిరిజన తండాకు వెళ్లే దారి

వర్షాకాలం వచ్చిందంటే చాలు.. వరిగుంతం గ్రామపంచాయతీ పరిధిలోని జలబాయి తం డావాసులకు ఈ దారి నరకప్రాయంగా మారు తోంది. తండాకు వెళ్లే రెండున్నర కిలోమీటర్ల మేర కనీసం మెటల్ రోడ్డు కూడా నోచుకోకపో వడంతో, మట్టి దారంతా బురదమయమై రాక పోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది.ఖ



# బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గం

నియామకం కొల్చారం మండల నాయకులకు కీలక బాధ్యతలు



సి కె న్యూస్ కొల్చారం నర్సాపూర్ :మెదక్ జిల్లా కొల్చారం మెదక్ జిల్లా బీజేపీ కార్యాలయంలో భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు వల్దాస్ మల్లేశం గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గ నియామక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు వడ్ల జనార్దన్ జిల్లా కార్యవర్గాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ నియామకాలలో భాగంగా మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని కొంగోడ్ గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు యాన్నారం యాదగిరిని బీజేపీ ఓబీసీ మోర్చా మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించారు. అలాగే చిన్నఘనపూర్ గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు పెద్దన్నగారి మధుసూదన్ గౌడ్ను బీజేపీ ఓబీసీ మోర్చా మెదక్ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా నియమిస్తూ పార్టీ నాయకత్వం నియామక పత్రాలను అందజేసింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు వల్దాస్ మల్లేశం గౌడ్ మాట్లాడుతూ పార్టీ కోసం నిస్వార్థంగా శ్రమించే ప్రతి కార్యకర్తకు సముచిత గుర్తింపు లభిస్తుందని, క్రమశిక్షణతో పనిచేసే నాయకులకు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత బాధ్యతలు అప్పగిస్తామని తెలిపారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన యాన్నారం యాదగిరి మరియు పెద్దన్నగారి మధుసూదన్ గౌడ్ మాట్లాడుతూ తమపై విశ్వాసం ఉంచి జిల్లా స్థాయి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు, నియమ నిబంధనలకు కట్టుబడి పనిచేస్తూ గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీని మరింత బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొల్చారం మండల బీజేపీ అధ్యక్షుడు ఘనపూర్ హరీశ్, కొల్చారం మండల ఇన్చార్జి, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేష్ గౌడ్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పల్లె రవికాంత్, కొంగోడ్ బూత్ అధ్యక్షుడు సత్యనారాయణ, ఏనిగండ్ల బూత్ అధ్యక్షుడు శ్రీశైలం, మండల సీనియర్ నాయకులు మహేశ్ యాదవ్తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నూతనంగా నియమితులైన నాయకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ నియామకాలతో మెదక్ జిల్లాలో బీజేపీ ఓబీసీ మోర్చా మరింత బలోపేతం అవుతుందని పార్టీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ కార్యకలాపాలను విస్తరించడంతో పాటు ఓబీసీ వర్గాల సమస్యలను పార్టీ వేదికగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు నూతన కార్యవర్గం కృషి చేస్తుందని పేర్కొన్నారు.

# ప్రాథమిక కొన్నత పాఠశాల భూమి పూజ నిర్మించిన సర్పంచ్...



మల్దకల్ ఆగస్టు 03: జోగులంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం నాగర్ దొడ్డి గ్రామం కు మంజూరైన పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణమునకు గ్రామ సర్పంచ్ శ్రీమతి ఖ వెంకటేశ్వరమ్మ సత్తన్న ఉప సర్పంచ్ జార్జి ప్రధానోపాధ్యాయుడు హెడ్మాస్టర్ బి రాఘవేంద్ర గుప్తా గ్రామ సెక్రెటరీ తిరుమలేష్ మరియు మాజీ ఎంపిటిసి భర్త మహేష్ అలాగే గ్రామ పెద్దలు జిన్ను హనుమంతు ఎం భీమేష్ కే రాముడు ఎం తమన్న మోహన్ గౌడ్ పటేల్ బతుకమ్మ కే శ్రీరాముడు శేఖర్ దేవరాజు హోటల్ ఏసేపు ఫీల్డ్ అసిస్టెంట్ ఆమోసు ఇంకా గ్రామ పెద్దలు కార్యకర్తలు ఇందులో భాగంగా పెద్ద ఎత్తున అందరూ కలిసి భూమి పూజ చేయడం జరిగినది.

# కీర్తిశేషులు కొండపర్తి అజయ్ రుద్ర దశదినకర్మలో పాల్గొన్న రాష్ట్ర నాయకులు వాకిటి అనంతరెడ్డి.



సి కె న్యూస్ అలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు ఆగస్టు 3.

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలో ఉన్న ఆరు గ్రామంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఫంక్షన్ హాలులో ఈరోజు కీర్తిశేషులు కొండపర్తి అజయ్ రుద్ర గారి దశదినకర్మలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు వాకిటి అనంతరెడ్డి పాల్గొన్నారు ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# సామ అండమ్మ దశదినకర్మలో పాల్గొన్న రాష్ట్ర నాయకులు వాకిటి అనంతరెడ్డి.



సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు ఆగస్టు 3. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలో ఉన్న ముద్దాపురం గ్రామానికి చెందిన సామ అండమ్మ అనారోగ్యం వలన పరమపదించినారు వారి దశదినకర్మలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు వాకిటి అనంతరెడ్డి పాల్గొని నివాళులర్పించారు ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల నాయకులు పాల్గొన్నారు.

## శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం అఖండ భజన సప్తాహ కార్యక్రమము కరపత్రం ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే ..



**సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల :** ఈరోజు గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు మల్దకల్ మండలం కేంద్రంలోని శ్రీ శ్రీ శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నందు అఖండ భజన సప్తాహ కార్యక్రమము తేదీ : 8-08-2026 శనివారం నుండి 15-08-2026 శనివారం జరిగే అఖండ జ్యోతి సప్తాహ భజన కరపత్రము ను లిఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి చేతులమీదుగా ఆవిష్కరించడం జరిగింది.

ఎమ్మెల్యే సర్పంచ్ శాలువా కప్పి పుష్పగుచ్ఛ ఇచ్చి ఘనంగా సత్కరించారు....

ఎమ్మెల్యే మాట్లాడుతూ...

సకాలంలో వర్షాలు పడాలని రైతులు పండించిన పంటలు మంచి గిట్టుబాటు ధర రావాలి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి గద్వాల సస్యశ్యామలముగా ఉండాలని కోరుతూ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సిరి సంపదలతో కలిగి ఉండాలని ఈ సప్తాహ భజన దేవాలయ ప్రాంగణంలో నిర్వహించడం జరుగుతుంది అని పేర్కొన్నారు.

ఈ సప్తహ భజన కార్యక్రమమును దిగ్విజయము చేసి స్వామి వారి కృపకు పాత్రలు కాగలరని కోరుచున్నాము.

ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ ప్రహ్లాద రావు, జిల్లా కన్వీనర్ నల్లారెడ్డి, సర్పంచ్ చిట్టెమ్మ, నాయకులు వెంకటన్న నరేందర్, మధునాయకి, తిమ్మరాజు, పరుశరాముడు, నాగరాజు, నారాయణ, నర్సింహులు, ప్రవీణ్, తిమ్మప్ప, శ్రీను, రాజు, కృష్ణమూర్తి , నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ జమ్ములమ్మ అమ్మవారు దేవాలయం జూనియర్ అసిస్టెంట్స్ బదిలీ మహబూబ్ నగర్ థర్డ్ గ్రేడ్ ఈవో గా



**సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల :** ఈరోజు గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు శ్రీ జమ్ములమ్మ అమ్మవారు దేవాలయం ఆలయం నందు జూనియర్ అసిస్టెంట్స్ పనిచేసిన రవి ప్రకాష్ మహబూబ్ నగర్ థర్డ్ గ్రేడ్ ఈవో బదిలీ అయిన సందర్భంగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కి మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సత్కరించారు....

ఈ కార్యక్రమంలో ఈవో పురేందర్, సింగల్ విండో డైరెక్టర్ రఘు కుమార్ శెట్టి, నాయకులు పూడూరు శ్యామ్, కేశవరెడ్డి, కృష్ణ రెడ్డి, దేవాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పీఎస్‌వో రామకృష్ణ తండ్రి బుచ్చన్న మృతి పట్ల ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సంతాపం...

**కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పిన ఎమ్మెల్యే**



**పెబ్బేరు ఆగస్టు03 (సి కే న్యూస్)** వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి తన వ్యక్తిగత భద్రత అధికారి (పీఎస్‌వో) రామకృష్ణ తండ్రి బుచ్చన్న మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.సోమవారం ఉదయం పెబ్బేరు మండలం తిప్పాయిపల్లి గ్రామంలోని వారి నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే, బుచ్చన్న కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా బుచ్చన్న పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం రామకృష్ణను, కుటుంబ సభ్యులను ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాంరెడ్డి,పట్టణాధ్యక్షుడు దయాకర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షులు విజయవర్ధన్ రెడ్డి, యుగేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా, ఖచ్చితత్వంతో ఓటరు జాబితా సవరణ పూర్తి చేయాలి.

**ఎస్ఐఆర్ డిజిటలైజేషన్, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ వేగవంతం చేయాలి: రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి.**




**సి కె న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి ఆగస్టు 03,**ప్రత్యేక ఓటరు జాబితా సవరణ--2026 కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, ఖచ్చితత్వంతో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. ఓటర్ల వివరాల డిజిటలైజేషన్, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియలను వేగవంతం చేసి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, సంబంధిత అధికారులతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశానికి ఐడీఓసీ కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ అంకిత్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఎస్ఐఆర్ డిజిటలైజేషన్‌ను వేగవంతం చేసి డూప్లికేట్ ఎంట్రీలు, ఫోటో మిస్‌మ్యాచ్‌లు, ఏఎస్‌డీ జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించి సరిచేయాలని ఆదేశించారు. ఎన్యుమరేషన్ ఫారాల్లో అన్ని వివరాలను పూర్తిగా నమోదు చేయడంతో పాటు బీఎల్‌వోల సంతకాలు తప్పనిసరిగా ఉండేలా చూడాలని సూచించారు.

శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన వారు, మరణించిన వారు, గుర్తించలేని ఓటర్ల వివరాలను మరోసారి సమగ్రంగా పరిశీలించి, బీఎల్‌ఏల ధృవీకరణతో జాబితాలను నవీకరించాలని తెలిపారు. మ్యాపింగ్ కాని ఓటర్ల వివరాలను వెంటనే పూర్తి చేయాలని సూచించారు.

పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణను పకడ్బందీగా నిర్వహించి, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

18 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హుడిని ఓటరుగా నమోదు చేసి ఒక్క అర్హుడూ మిగిలిపోకుండా చూడాలని ఆదేశించారు. వీవీఐపీ, వీఐపీ ఓటర్ల మ్యాపింగ్‌ను సహాయ ఎన్నికల నమోదు అధికారులు స్వయంగా పరిశీలించి ధృవీకరణ పత్రాలు సమర్పించాలని సూచించారు.

జిల్లాలో 95 శాతం డిజిటలైజేషన్ పూర్తి

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో సమావేశమైన జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ప్రతి దరఖాస్తును గడువులోగా పరిష్కరించాలని, డూప్లికేట్ ఎంట్రీలు, ఫోటో మిస్‌మ్యాచ్‌లు, ఏఎస్‌డీ జాబితాలను పూర్తిస్థాయిలో సరిచేయాలని సూచించారు.

బీఎల్‌వోలు, బీఎల్‌ఏల సమన్వయంతో మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా మారిన వారు, గుర్తించలేని ఓటర్ల వివరాలను మరోసారి ధృవీకరించి జాబితాలను నవీకరించాలని ఆదేశించారు. ఒకే కుటుంబ సభ్యుల ఓట్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా హేతుబద్ధీకరణ చేపట్టాలని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హుడిని ఓటరుగా నమోదు చేసి వంద శాతం నమోదు లక్ష్యాన్ని సాధించాలని సూచించారు.

జిల్లాలో ఇప్పటివరకు 95 శాతం ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ పూర్తయిందని, మిగిలిన ప్రక్రియను కూడా నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

ఈ సమావేశంలో ఎన్నికల సూపరింటెండెంట్ రంగ ప్రసాద్, ఎన్నికల సిబ్బంది నవీన్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పందిళ్ళపల్లి గ్రామసభలో అభివృద్ధి ప్రజారోగ్యంపై కీలక నిర్ణయాలు .

**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**మండల పరిధిలో పందిళ్లపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో లిగ్రామ సర్పంచ్ శ్రీమతి వత్సవాయి పద్మ అధ్యక్షతన గ్రామ పంచాయతీ పాలక వర్గ సమావేశం నిర్వహించడం జరిగింది.

ఈ సమావేశంలో గ్రామంలో చేపట్టవలసిన వివిధ అభివృద్ధి పనులు, మౌలిక వసతులు మరియు సంక్షేమ తాగునీటి సమస్య డ్రైనేజీ కాలువలు పరిశుభ్రత దోమల నివారణ కార్యక్రమాల అమలుపై చర్చించి, తగు నిర్ణయాలు తీసుకోవడం జరిగింది.



ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మేకల కల్పన , పంచాయతీ కార్యదర్శి రఘు మరియు వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# గ్రామసభలో సుకన్య యోజన పథకం



**సి కె న్యూస్ కొల్చారం నర్సాపూర్ :**మెదక్ జిల్లా కొల్చారం మండలం రంగంపేట గ్రామంలో గ్రామ సభ ఎంతో కచ్చితంగా గ్రామసభ గ్రామసభలో సుకన్య యోజన చిన్న పిల్లల నుంచి అమ్మాయి అయితే పోస్ట్ ఆఫీస్ లో అకౌంట్ తీసి సుకన్య యోజన కింద నెలకు 1000 వరకు జమ చేసుకోవాలని కోరారు ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలంటని సూచించారు వేరే కాళ్లు చేసి మీకు ఇస్తాం ఆలోచిస్తామని గ్రామసభలు చెప్పారు పెద్ద మొబైల్ పెట్టుకొని ఆన్లైన్ గేమ్ ఆడవద్దని చెప్పారు ఈ సందర్భంగా మాట్లాడుతూ 20 వేల నుండి 30 సైబర్ మొబైల్లో వాల్ చేసి మెదక్ జిల్లాలో 32 మంది దగ్గర ఇలాగే ఆన్లైన్ గేమ్ ఆడి మోసపోకండి సైబర్ కాళ్లు చేసి ఓటీపీ నంబరు చెప్పకండి తెలిసినవారికి ఫోన్ ఇచ్చి అత్యవసరం ఉంటేనే ఇవ్వండి లేకపోతే లేదు శిశు సంరక్షణ తల్లిపాలు ఎంతో పుట్టిన బిడ్డకు పాలు ఇప్పించాలి అని అంగడి వాడి సిబ్బంది కోరారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంతో ప్రశాంతంగా ముగిసిన రంగంపేట గ్రామసభ

## రేపులవాడ గ్రామం డ లక్ష్మీపురం గ్రామానికి బీటీ రోడ్ నిర్మాణం పూర్తి

**నిధులు మంజూరు చేసిన తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కు కు రేపల్లెవాడ గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తె లియజేశారు**

**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**చింతకాని మండలం రేపల్లెవాడ గ్రామం నుంచి లక్ష్మీపురం గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణం జరుగుతుంది ఈ రోడ్డు ద్వారా చింతకాని బోనకల్ మండలాలకి రవాణా సౌకర్యం మెరుగవుతుంది మరియు యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్ కి చింతకాని మండలానికి ముఖ్య కనెక్టివిటీ రోడ్డు గా మారుతుంది ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన మల్లు భట్టి విక్రమార్క కి రేపల్లెవాడ గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేయడం జరుగుతుంది . ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు మడిపల్లి రాంప్రసాద్ పరిశీలించడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు




## సీపీఎం నేత సామినేని రామారావు (73) హత్య కేసులో మళ్లీ దర్యాప్తు.



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**చింతకాని మండలం పాతర్లపాడులో హత్య ఘటన జరిగి 9 నెలలు గడిచిన కొలిక్కిరాని కేసు పురోగతి. రంగంలోకి దిగిన నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీ ఎన్ ఎఫ్ సి యు) నిపుణుల బృందం నేడు ఖమ్మం పోలీసు ట్రైనింగ్ సెంటర్‌లో విచారణకు హాజరు కావాలని 28 మందికి పోలీసుల నోటీసులు అనుమానితులు,సాక్షులను ప్రశ్నించనున్న చీఫ్‌ఖా నిపుణుల బృందం గతంలో బెంగుళూరులో పాలిగ్రాఫ్ పరీక్షలకు 24 మందికి నోటీసులు.. ఆరుగురే హాజరు.

పాలిగ్రాఫ్ పరీక్షల అనంతరం కేసులో పురోగతి లేకపోవడంతో మళ్లీ దర్యాప్తు. హత్య కేసు ఛేదనకు కీలక ఆధారాల సేకరణపై పోలీసుల దృష్టి. కొత్త కోణాల్లో కేసును పరిశీలించనున్న చీఫ్‌ఖా నిపుణులు.

## వనమహోత్సవంలో ఇంటింటికి మొక్కల పంపిణీ చేసిన సర్పంచ్ చాపలమడుగు వీరబాబు.





**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**చింతకాని మండల పరిధిలోని తిరుమలాపురం గ్రామంలో వనమహోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఇంటింటికి మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు గ్రామ ప్రజలకు మొక్కలను పంపిణీ చేసి, ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఎంతో అవసరమని, మొక్కలను నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. భావితరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఇంటా పచ్చదనం పెంపొందించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కొండపల్లి ఉమారాణి, ఉప సర్పంచ్ గోగుల నాగమణి, మేటు మడిపల్లి రామకృష్ణ, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వనమహోత్సవశీలో ఇంటింటికి మొక్కల పంపిణీ చేసిన గ్రామ సర్పంచ్ వత్సవాయి పద్మ



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**మండల పరిధిలో పందిళ్లపల్లి గ్రామంలో పచ్చదనం పెంపొందించే లక్ష్యంతో గ్రామ సర్పంచ్ శ్రీమతి వత్సవాయి పద్మ ఆధ్వర్యంలో గ్రామస్తులకు మొక్కలు పంపిణీ చేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని సర్పంచ్ కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి పంచాయతీ సిబ్బంది గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.